నేటి కందం- నేటికి అందం

అనయము మనకై యోచిం
చిన నేతగ భారతమున శేముషి గొని-ఈ
దినమున ప్రమాద మందున
ఘనుడైన సుభాసు బోసు కనుమరు గయ్యెన్
(18-8-1945 బోసుబాబు అదృశ్యం)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

కదులలేని కారుకు
కట్టుతున్న ట్రాకులు
చేయితోనే పూవుతోనో
షేక్ హాండు లీకులు
విలీనాలపైన ఏలా
వింత రాజకీయ దృష్టి
అధికారపు పార్టీలకు
అవసరమా విషముష్టి

చురక



-వేల్పుల నారాయణ
9440433475

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 18-8-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:14 పేజీలు:6 వెల: రూ.1/-


## ఆధునిక పద్ధతులతో సేద్యం చేయాలి- గుత్తా సుఖేందర్ రెడ్డి



నల్గొండ, ఆగష్టు 17 :ఆధునిక పద్ధతులతో సేద్యం చేయడం ద్వారా అధిక లాభాలను సాధించవచ్చని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల ఆవరణలో రైతుబడి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అగ్రి షోను వారు ప్రారంభించారు.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మారుతున్నకాలనికి అనుగుణంగా కొత్త పద్ధతులు అవలంబించాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయాన్ని చేకూర్చే పంటల సాగుపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే పంటలపై దృష్టి సారించాలని కోరారు. ఆయిల్‌పామ్ పంట సాగును ప్రోత్సహించేందుకు ఇస్తున్న రాయితీలను ఉపయోగించుకోవాలని కోరారు. అగ్రిషో లో ఏర్పాటుచేసిన స్టాళ్ల ద్వారా రైతులకు ఆధునాతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగేలా కలిగేలా ఉపయోగపడిందన్నారు.

అగ్రిషోతో అధునాతన పద్ధతులపై అవగాహన

ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ అగ్రిషోతో అధునాతన పద్ధతులపై అవగాహన పెరుగుతోందన్నారు. స్టాళ్లలో ఏర్పాటుచేసిన నూతన వరి వంగడాలు, తోటల పెంపకం, గడ్డి కోసే యంత్రాలు, వ్యవసాయదారిత పరిశ్రమల ఏర్పాటు పై అవగాహన పెంచుకునేందుకు రైతులు ఆసక్తికరపరచడం కనిపించిందని అన్నారు. వ్యవసాయుధారిత రంగాలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు.

### ఇలాంటి షోలు నిర్వహించడం అభినందనీయం

ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులపై ఇలాంటి అగ్రిషోలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. చదువుకున్న యువ రైతులు సాగు పద్ధతులపై మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నిర్వాహకుడు రాజేందర్ రెడ్డి. వివిధ విత్తన కంపెనీలు, యంత్రాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## స్కిల్ వర్సిటీలో ఆరు కోర్సులు..



హైదరాబాద్, ఆగష్టు 17 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు రూపు దిద్దుకున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా పలు రంగాల్లో కోర్సులను దసరా పండగ నుంచి ప్రారంభిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా దాదాపు 20 కోర్సులను నిర్వహించాలని గుర్తించడం జరిగిందని, వీటిలో దసరా పండగ నుంచి ప్రాథమికంగా ఆరు కోర్సులను ప్రారంభించాలని నిర్ణయించినట్టు తెలిపారు.

ఈ స్కిల్ యూనివర్సిటీ ప్రారంభం, విధి విధానాల ఖరారు, కోర్సుల ప్రారంభం తదితర అంశాలపై నేడు ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఎస్. శాంతి కుమారి మాట్లాడుతూ.. ముచ్చర్ల వద్ద కేటాయించిన 57 ఎకరాల స్థలంలో ఈ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని, ఈ నిర్మాణ పనులు ముగిసేంత వరకు ఈ యూనివర్సిటీని తాత్కాలిక భవనంలో నిర్వహించనున్నట్టు తెలిపారు.

## సింగరేణిని ఇతర రంగాల్లో విస్తరించాలి : డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, ఆగష్టు 17 :సింగరేణి ఇతర మైనింగ్ రంగాల్లో విస్తరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. అంబేద్కర్ సచివాలయంలో సంస్థ భవిష్యత్ ప్రణాళికలు, అభివృద్ధిపై జరిగిన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, బొగ్గు వంటి సాంప్రదాయ ఇంధన వనరులకు కాలం చెల్లుతోందని.. భవిష్యత్ అంతా విద్యుత్ బ్యాటరీలే కేంద్రంగా మారబోతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో లిథియం, అనేక మూలకాల అన్వేషణ, వాటిని వెలికితీయడంపై సింగరేణి దృష్టి సారించాలన్నారు. సింగరేణి సంస్థ తన మనుగడను కొనసాగిస్తూ ఆస్తులను, సంపదను సృష్టించుకోవాలని సూచించారు. డిన్యూటీ సీఎం చెప్పా రు. సింగరేణి సంస్థ మెటల్స్, నాన్ మెటల్స్ మైనింగ్‌లో ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలన్నారు. ఇందుకు అవసరమైతే ఓ కన్సెల్టెన్సీని నియమించుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీలో భాగంగా రాష్ట్రంలో ఫ్లోటింగ్ సోలార్, పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహకాలు చేస్తున్నట్లు అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. ఇందుకు సంబంధించి పూర్తి డీపీఆర్‌లు రూపొందిస్తున్నామని.. త్వరలోనూ వాటిని ప్రభుత్వానికి అందిస్తామని విక్రమార్కకు వివరించారు. ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో బొగ్గు ఎప్పటినుంచి ఉత్పత్తి ఆరంభిస్తారని భట్టి ఆరా తీశారు. సమీక్షా సమావేశంలో ఎనర్జీ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, స్పెషల్ సెక్రెటరీ కృష్ణభాస్కర్, సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్ పాల్గొన్నారు.

## కాలక్రమేణ తగ్గుతోన్న చంద్రుడు..సూర్యుని చుట్టూ తిరిగే వేగం

### -నిదానంగా భూమికి దూరం అవుతున్న చంద్రుడు
### -ఇలాగే కొనసాగితే భూమి, చంద్రుని మధ్య ధూరం పెరిగి వెన్నెల రాత్రులు
### -భవిష్యత్తులో రోజుకు 25 గంటలు ఉండనున్నాయట

న్యూ ఢిల్లీ ఆగష్టు 17 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):;భవిష్యత్తులో రోజుకు 25 గంటలు ఉండనున్నాయట. ఎందుకంటే భూమి నుంచి చంద్రుడు నిదానంగా దూరం అవుతున్నాడట. చంద్రుడు?సూర్యుని చుట్టూ తిరిగే వేగం కాలక్రమేణ తగ్గుతోందట. ఇలాగే కొనసాగితే భూమి, చంద్రుని మధ్య ధూరం పెరిగి వెన్నెల రాత్రుల తగ్గొచ్చని శాస్త్రవేత్తల అంచనా.

విస్కాన్సిస్-మాడిసన్ విశ్వవిద్యాలయ బృందం నిర్వహిచిన పరొశోధన ప్రకారం చంద్రుడు సంవత్సరానికి 3.8 సెంటీ మీటర్ల చొప్పున భూమి నుంచి దూరం జరుగుతున్నాడు. ఇలాగే కొనసాగితే 200 మిలియన్ సంవత్సరాల కాలంలో భూమిపై రోజుకు 25 గంటలు ఉండే అవకాశం ఉందని పరిశోధనలో వెల్లడయింది.

1.4 బిలియన్ సంవత్సరాల క్రితం భూమి మీద రోజుకు 18 గంటలు ఉండేవి. వాతావరణ మార్పు, భూమి, చంద్రుని మధ్య దూరం పెరిగి నెమ్మదిగా రోజుకు 24 గంటలకు చేరింది. కానీ రానున్న కాలంలో 24 గంటలు కాస్తా 25 గంటలయ్యే అవకాశం ఉందంటున్నారు. ఆ కాలాన్ని మనం చూడలేము. ఎందుకంటే దానికి దాదాపు 200 బిలియన్ సంవత్సరులు పడుతుందని అంచనా.

## హరీశ్ రావు సిద్దిపేట కార్యాలయాన్ని ధ్వంసంచేసిన గుర్తు తెలియని వ్యక్తులు

హైదరాబాద్ ఆగష్టు 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ప్రస్తుత బిఆర్ఎస్ ఎంఎల్ఏ, మాజీ మంత్రి హరీశ్ రావు సిద్దిపేట కార్యాలయాన్ని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అది కూడా శనివారం తెల్లవారు జామున. ఈ దాడి అధికారంలో ఉన్న కాంగ్రెస్ పనే అని బిఆర్ఎస్ నిందిస్తోంది. పంట రుణాల మాఫీ చేసినందున హరీశ్ రావు రాజీనామా చేయాలంటూ కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు ఫ్లెక్సీ బ్యానర్లను కూడా టౌన్ లో ఏర్పాటు చేశారని వార్త. ఇదివరలో పంట రుణమాఫీ చేస్తే తాను పదవికి రాజీనామా చేస్తానని హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాలు విసిరారన్నది ఇక్కడ గుర్తు చేసుకోవాలి. హరీశ్ రావు మద్దతుదారులు శుక్రవారం రాత్రి ఫ్లెక్సీ బ్యానర్లను తొలగించారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ వర్గం వారు నినాదాలు చేస్తూ ఒకరిపై మరొకరు విరుచుకుపడడంతో పోలీసులు కలుగజేసుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం తెల్లవారు జామున కొందరు గుర్తు తెలియని వ్యక్తులు హరీశ్ రావు కార్యాలయంలోకి చొరబడి బ్యానర్లను చించేసి, విధ్వంసం సృష్టించారు. పైగా 'జై కాంగ్రెస్' అంటూ నినాదాలు చేశారని సమాచారం. ఈ ఘటనను హరీశ్ రావు ఖండించారు. 'పోలీసులు దాడిని నివారించడానికి బదులు, విశృంఖలానికి పాల్పడిన వారికి రక్షణ నిచ్చారు' అని హరీశ్ రావు 'ఎక్స్' పోస్ట్ లో విమర్శించారు. డిజిపి ఈ ఘటనలో చర్యలు తీసుకోవాలని కూడా హరీశ్ రావు కోరారు. కాగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు ఇది పిరికిపంద చర్య అంటూ ఆ ఘటనను ఖండించారు. 'ఇదేనా రాహుల్ గాంధీ మొహబ్బత్ కీ దుకాణ్' అని విమర్శించారు.

## సీఎం రేవంత్‌తో మంత్రి పొన్నం భేటీ..



హైదరాబాద్, ఆగష్టు 17 :మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పెట్టుబడుల కోసం అమెరికా, కొరియా పర్యటన విజయవంతంగా పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు.

## ప్రధాని మోదీ, నిర్మలా సీతారామన్‌తో ముగిసిన చంద్రబాబు భేటీ



న్యూఢిల్లీ, ఆగష్టు 17: : ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానితో పాటు, పలువురు కేంద్ర మంత్రులను శనివారం సాయంత్రం కలిశారు. ప్రధాని నరేంద్ర మోదీ తో భేటీ అయిన చంద్రబాబు మోదీని సన్మానించి రాష్ట్రంలో చేపట్టిన పనుల పురోగతిని, అందుకు కేంద్రం నుంచి కావాల్సిన సహాయాన్ని కోరారు. ఈ సందర్భంగా ప్రధానికి వినతి పత్రం అందజేశారు.

రాజధాని అమరావతి నిర్మాణం పూర్తికి, పోలవరం ప్రాజెక్టు కు ఇదివరకే ప్రకటించిన విధంగా ఆర్థిక సహాయాన్ని వెంటనే విడుదల చేయాలని చంద్రబాబు కోరారు. దాదాపు గంటపాటు ఇద్దరి మధ్య చర్చలు జరిగినట్లు సమాచారం . అనంతరం చంద్రబాబు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. వీరి మధ్య 40 నిమిషాల పాటు సమావేశం కాగా రాష్ట్రానికి అభివృద్ధి, సంక్షేమానికి భారీగా నిధులు కేటాయించాలని కోరారు.

అక్కడే ఉన్న ఉక్కు, గనుల శాఖ మంత్రి కుమారస్వామితో చంద్రబాబు సమావేశమయ్యారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో అమరావతికి ప్రత్యేక సహాయంగా రూ.15 వేల కోట్లను ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించిన విషయం తెలిసిందే. రెండు రోజుల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిన్న(శుక్రవారం) ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఢిల్లీ విమానాశ్రయంలో చంద్రబాబుకు టీడీపీ ఎంపీలు ఘనస్వాగతం పలికారు.

## మంత్రి జూపల్లి కృష్ణారావు కారుపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడి..

జోగులాంబ గద్వాల్ ఆగష్టు 17 (ఎకెక్స్ ప్రెస్ న్యూస్);: మంత్రి జూపల్లి కృష్ణారావు కారుపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేశారు. జూపల్లి డౌన్ డౌన్ అంటూ నిరసన తెలిపారు. గద్వాల జిల్లాలో రిజర్వాయర్ల పరిశీలనకు వెళ్తున్న జూపల్లి కృష్ణారావు కారును సరిత వర్గీయులు అడ్డుకొని రాళ్లతో దాడికి దిగారు. బిఆర్ఎస్ ఎంఎల్ఎ బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నందుకు నిరసనగా దాడి చేశారు. సరిత తిరుపతయ్య ఇంటికి మంత్రి జూపల్లి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆందోళన చేయడంతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మధ్యలోనే కారు దిగి తన ఇంటికి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## చట్టాలను గౌరవించే వ్యక్తిని.. మహిళా కమిషన్ ఎదుట హాజరవుతా.. : కేటీఆర్

ఖఖీ । తెలంగాణ మహిళా కమిషన్ జారీ చేసిన నోటీసులపై కేటీఆర్ స్పందించారు. ఈ నెల 24న కమిషన్ ఎదుట హాజరవుతానని తెలిపారు. గత ఎనిమిది నెలలుగా కాంగ్రెస్ పాలనలో జరిగిన దురాగతాల వివరాలను కమిషన్‌కు అందజేస్తానని చెప్పారు. తాను బహిరంగ క్షమాపణలు చెప్పిన తర్వాత కూడా నోటీసులు ఇచ్చారన్నారు. మా మహిళా ఎమ్మెల్యేలపై సీఎం, నేతలు వ్యాఖ్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. తాను చట్టాలను గౌరవించే వ్యక్తినని చెప్పారు. ఈ నెల 24న ఉదయం 11 గంటలకు హాజరుకావాలని కేటీఆర్‌కు మహిళా కమిషన్ నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే.

## ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి.. కలెక్టర్ ప్రతీక్ జైన్

హైదరాబాద్, ఆగష్టు 17 : వికారాబాద్ జిల్లా ప్రజలు ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలెవరికైనా ఆరోగ్య సమస్యలు ఏర్పడి, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులలో కానీ, ప్రైవేట్ ఆస్పత్రులలో కానీ వైద్య సేవలు పొందడంలో ఏవైనా సమస్యలు ఎదుర్కొన్నట్లైతే ఈ క్రింద తెలిపిన వాట్సప్ నెంబర్ 7780478817 కు మెసేజ్ ద్వారా సమాచారం అందించగలరని కోరారు.

ఈనెంబర్ కు సమాచారం అందిన వెంటనే మీ సమస్య పరిష్కరించడం కోసం తమ బృందం మీకు అందుబాటులో ఉండి సహాయపడుతుందని జిల్లా ప్రజలకు కలెక్టర్ తెలిపారు.






## ఆగస్టు 19న కనిపించబోతున్న అరుదైన సూపర్ మూన్

హైదరాబాద్, ఆగష్టు 17 :అరుదైన సూపర్ మూన్ 2024 ఆగష్టు 19న కనిపించబోతున్నది. సోమవారం ఈ సంపూర్ణ చంద్రగ్రహణం కనిపించనున్నది. అమెరికాలో సంపూర్ణ చంద్రగ్రహనాన్ని అనేక పేర్లతో పిలుస్తారు. ముఖ్యంగా సూపర్ మూన్, బ్లూమూన్, స్టర్జన్ మూన్ అని రకరకాలుగా పిలుస్తుంటారు. 'సూపర్' అనేది చంద్రుడి భ్రమణాన్ని సూచిస్తుంది. ఈ నెలలో చంద్రుడు భూమికి కాస్త దగ్గరగా రాబోతున్నాడు. అప్పుడు కాస్త పెద్దగా, ప్రకాశవంతంగా కనిపించనున్నాడు. భారీ ఖగోళ విశేషం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న వారందరికీ ఇదో శుభవార్త. ఇంతకు ముందు నివేదించినట్లుగా, ఈ సంవత్సరం మనం వరుసగా నాలుగు సూపర్‌మూన్‌లను చూస్తాము. నాలుగింటిలో మొదటిది ఆగష్టు 19న సోమవారం మధ్యాహ్నం 2:26 ఖఓ ఇఊకి (సుమారు 12:00 ంఓ ఎూ) కనిపించనున్నది. నాసా ప్రకారం, చంద్రుడు భూమికి 90 శాతం దగ్గరగా ఉన్నప్పుడు సూపర్‌మూన్ సంభవిస్తుంది. సూపర్‌మూన్ అనే పదాన్ని ఖగోళ శాస్త్రవేత్త రిచర్డ్ నోల్లే 1979లో ఉపయోగించారు. ఫుల్ సూపర్‌మూన్‌లు సంవత్సరంలో ప్రకాశవంతమైన , అతిపెద్ద పౌర్ణమిగా ప్రసిద్ధి చెందాయి. ఇది సాధారణ చంద్రుని కంటే 30 శాతం ప్రకాశవంతంగా , 14 శాతం పెద్దదిగా కనిపిస్తుంది. పరిమాణం , ప్రకాశం గణనీయంగా ఎక్కువగా కనిపించినప్పటికీ, దృగ్విషయం సమయంలో వ్యత్యాసాన్ని చెప్పడం చాలా కష్టం.

## కేబినెట్ భేటీ తేదీ మారింది

అమరావతి, ఆగష్టు 17 : ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం తేదీ మారింది. ఈనెల 27న జరగాల్సిన కేబినెట్ సమావేశాన్ని 28వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. వెలగపూడి సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఆరోజు ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని తెలిపింది.

24వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ప్రతిపాదనలు పంపాలని అన్ని ప్రభుత్వ శాఖలను సీఎస్ కార్యాలయం ఆదేశించింది. ఈ సమావేశంలో పలు అంశాలపై కేబినెట్ చర్చించి నిర్ణయం తీసుకోనుంది.

## మూడు రోజుల పాటు స్పెషల్ రైళ్లు రద్దు..!

న్యూఢిల్లీ, ఆగష్టు 17: :పలు ప్రత్యేక రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. మూడు రోజుల పాటు వివిధ మార్గాల్లో నడిచే ప్రత్యేక రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. నేటి నుంచి (ఆగస్టు 17) తిరుపతి-కాచిగూడ, కాకినాడటౌన్-సికింద్రాబాద్, సికింద్రాబాద్ ? కాకినాడ టౌన్, నర్సాపూర్-సికింద్రాబాద్, సికింద్రాబాద్-నర్సాపూర్ వెళ్లే రైల్లు అందుబాటులో ఉండవని రైల్వే శాఖ తాజాగా పేర్కొంది.

# జమ్మూ ప్రాంతంలో పెరుగుతున్న ఉగ్రవాద కదలికలు !

తాజాగా స్వాతంత్ర్యం దినోత్సవ వేడుకలు నిర్వహించుకుంటున్న శుభ గడియల్లో దోడా జిల్లాలోని అడవుల్లో భద్రతా దళాలు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఆర్మీ కమాండర్ కెప్టెన్ దీపక్ సింగ్ అమరుడు కావడం విచారకరం. ఇటీవలి కాలంలో దోడా–ఉధంపూర్–కిస్తినాడ్ ప్రాంతాల్లో జరిగిన నాలుగవ ఎన్‌కౌంటర్‌గా ఈ దుర్ఘటన నిలుస్తున్నది. గతంలో శ్రీనగర్ – లడఖ్ – లేహ్ ప్రాంతాల్లో చెలరేగిన ఉగ్రవాదుల దుశ్చర్యలు నేడు శాంతియుతంగా ఉండే జమ్మూ ప్రాంతాలకు మారడం తీవ్ర కలవరానికి గురి చేస్తున్నట్లు స్పష్టం అవుతున్నది. నేటి విదేశీ ప్రేరేపిత ఉగ్రవాదులు తమ పంథాను మార్చుకొని నూతన మార్గాలను అన్వేషిస్తూ, ఆచరణలో పెట్టడంతో గత కొన్ని మాసాలుగా జమ్మూ ప్రాంతంలో ఉగ్రదాడులు పెరగడంతో పలువురు ఆర్మీ జవాన్లు, అధికారులు సహితం ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం. డిసెంబర్–2022లో నలుగురు, ఏప్రిల్–మే 2023లో 14 మంది, నవంబర్–2023లో ఐదుగురు, డిసెంబర్–2023లో నలుగురు, మే–2024లో ఒక్కరు, జూన్–2024లో 15 మంది, జూలై–2024లో తొమ్మి మంది భద్రతా దళాలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత అక్కడ పాకిస్థాన్, చైనా ప్రేరేపిత ఉగ్రవాద ఘటనలు పలుచబడడం, శాంతి నెలకొనడం, సామాన్యుల జీవనభృతి పెరగడం గమనించాం. లేహ్, గల్వాన్ ప్రాంతాల్లో చైనా బలగాలు భారత భూభాగంలోకి చొరబడే ప్రయత్నాలు చేయడం అనాదిగా జరుగుతోంది. నేడు ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే జమ్మూ ప్రాంతాల్లో నూతన వ్యూహాలతో తీవ్రంగా, తరుచుగా ఉగ్రదాడులు జరుగుతుండడంతో భారత ఆర్మీ, స్థానిక పోలీసు బలగాలకు పెద్ద సమాలుగా మారింది. ఈ హఠాత్తు పరిణామాలతో మన ఇంటెలిజెన్స్ వ్యవస్థలు కూడా అయోమయంలో పడినట్లు తోస్తున్నది.

జమ్మూ ప్రాంతంలో ఉగ్రదాడులు:

జమ్మూ కాశ్మీర్ ప్రాంతాల ఆర్మీ అడ్మినిస్ట్రేటివ్ పోస్టులు స్థానిక ప్రజల సమాచారం ఆధారంగా పని చేయడం సాధారణంగా జరుగుతూ వస్తున్నది. స్థానికుల నుంచి తాజా ఆహారం, లాజిస్టిక్ సపోర్టు, అత్యవసర పరిపాలన వస్తువులు, శీతాకాల వంట చెరుకు, చొరబాటుదారుల సమాచారం లాంటి సహాయాలను మన ఆర్మీ పొందుతూ వస్తున్నది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత శాంతి నెలకొనడంతో మన ఆర్మీ, ఇంటెలిజెన్స్ వ్యవస్థల క్యాంపులు కొంత వరకు పలుచబడడం వల్ల స్థానికులకు ఆర్మీ అందించే ఆదాయ మార్గాలు మూతబడడంతో పాటు ఉగ్రవాదుల చొరబాట్లపై నిఘా కూడా కొంత తగ్గి ఉండవచ్చు. నేడు ఉగ్రమూకలు ఇచ్చే నగదుకు ఆశపడే స్థానికులు వారికి సహకరించడం ప్రారంభమైందని స్పష్టం అవుతున్నది. ఈ పరిస్థితులను చైనా, పాకిస్థాన్‌లు ఆసరాగా తీసుకొని ఉగ్రవాదులకు శిక్షణ ఇవ్వడం, ఉగ్రదాడులు పెరగడం, ఆర్మీ జవాన్లు పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోవడం చూస్తున్నాం. నేడు పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు జమ్మూ ప్రాంతానికి చెందిన 'ఓవర్ గ్రౌండ్ వర్కర్స్ (ఓజిడబ్ల్యూ)' సహాయంతో తమ విధ్వంసాగ్నిని కొనసాగిస్తున్నారని తెలుస్తున్నది. నేడు స్థానిక దోడా ప్రాంత మహిళలు కూడా డబ్బుకు ఆశపడి ఉగ్రవాదులకు ఆశ్రయం, ఆహారం, సిమ్ కార్డులు, శారీరక సుఖాలు, గైడ్స్‌గా మారి సమాచారం అందివ్వడానికి సహకరించడంతో ఆ మహిళల్ని సోదా చేయడానికి మన భద్రతా దళాలకు పరిమితులు ఉండడంతో ఉగ్రవాదులదే పై చేయిగా కనిపిస్తున్నది. దీనికి విరుగుడుగా గతంలో జరిగినట్లుగా మన భద్రతా దళాల్లో మహిళా స్పెషల్ ఆఫీసర్లను తిరిగి నియమించుకొని అక్కడి అనుమానిత మహిళల్ని క్షున్నంగా సోదాలు, ఇంటరాగేషన్లు చేయాల్సి ఉంటుంది.

నూతన 'టెర్రర్ క్యాపిటల్'గా మారిన జమ్మూ:

జమ్మూ ప్రాంతంలో ఎత్తైన పర్వత శ్రేణులు, మైదాన ప్రాంతాలు, దట్టమైన అడవులు ఉండడంతో భద్రతా దళాల చర్యలకు అవరోధాలు ఎదురవుతున్నాయని వింటున్నాం. ఉగ్రదాడులు పేట్రేగి పోవడంతో నేడు జమ్మూ ప్రాంతం 'ఉగ్ర కేంద్రం (టెర్రర్ క్యాపిటల్)'గా మారడం ప్రమాదకర పరిణామంగా తీసుకోవాలి. 09 జూన్ 2024న ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం జరుగుతున్న వేళల్లో ఉగ్రవాదులు చేసిన బస్సు దాడిలో 10 మంది ప్రాణాలు పోవడంతో పాటు 33 మంది గాయపడడం చూసిగ్భ్రాంతి చెందాం. రాసి, దోడా, కతువా ప్రాంతాల్లో భద్రతా బలగాల వాహనంపై జరిగిన ఉగ్రదాడుల్లో ఏడుగురు యాత్రికులు, ఒక సిఆర్‌పిఎఫ్ జవాన్ ప్రాణాలు కోల్పోగా, ఏడుగురు భద్రతా దళాలు గాయపడడం జరిగింది. కుల్గావ్ ప్రాంతంలో ఇద్దరు జవాన్లతో పాటు ఆరుగురు తీవ్రవాదులు ప్రాణాలు కోల్పోయారు. తాజా సమాచారం ప్రకారం కనీసం వంద వరకు విదేశీ ఉగ్ర చొరబాటుదారులు జమ్మూ ప్రాంతానికి చేరినట్లు తెలుస్తున్నది. గత 32 మాసాల్లో 70 మంది, అందులో 52 మంది భద్రతా సిబ్బంది, 18 మంది సాధారణ పౌరులు ఉగ్రదాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. రాసి, కుల్గావ్, కతువా, ఉదంపూర్, దోడా, కిష్ట్‌వార్, రాజోరీ, పూంచ్ ప్రాంతాల్లో చొరబాటుదారులు క్రియాశీలంగా మారిపోవడం జరుగుతున్నట్లు అర్థం అవుతున్నది. పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ పర్వత ప్రాంతాల్లో అత్యాధునిక అమెరికన్ ఎం4 రైఫిల్ లాంటి ఆయుధాలపై సహితం శిక్షణ పొందిన ఉగ్రవాదులు భారత భూభాగంలోకి చొరబడి జమ్మూ ప్రాంతంలో భద్రతా బలగాలపై విధ్వంసకర దాడులు చేయడం, పర్వత ప్రాంతాల్లో దాక్కోవడం కొనసాగుతున్నది.

ఉగ్రదాడుల కట్టడికి సమర్థవంతమైన సమన్వయ వ్యూహాలు:

నేడు జమ్మూ ప్రాంతంలో పెరిగిన ఉగ్రదాడులను సమర్థవంతంగా అడ్డుకోవడానికి కావలసిన నిఘా వ్యవస్థలు, భద్రతా దళాల శిబిరాలు, ఇంటెలిజెన్స్ ఆపరేషన్లు తిరిగి పెంచవలసిన అగత్యం ఏర్పడినట్లు స్పష్టంగా తెలుస్తున్నది. వరుస ఉగ్రదాడులు మన భద్రతా దళాలకు సవాళుగా మారడం, ప్రభుత్వ నియంత్రణ కొరవడడం, అసెంబ్లీ ఎన్నికలు వాయిదా పడడం కూడా పరిస్థితులు దిగజారడానికి కారణం అవుతున్నాయి. ఉగ్రవాదులు మార్చుకున్న వ్యూహాలకు అనుగుణంగా సత్వరమే భారత భద్రతా దళాలు తమ ఉగ్ర వ్యతిరేక వ్యూహాలకు పదును పెట్టి ఉగ్రవాద విష కోరల్ని పెకిలించి వేస్తూ, సామాన్యులతో పాటు భద్రతా దళాల ప్రాణాలను కాపాడటానికి ప్రాధాన్యం ఇవ్వాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారు.

370 ఆర్టికల్ రద్దు తర్వాత కూడా ఉగ్రదాడులు ఆగవనే సందేశం ఇవ్వడానికి విదేశీ ఉగ్రవాదులు తీవ్ర స్థాయిలో దాడులు చేస్తున్నట్లు తెలుస్తున్నది. జమ్మూ, కాశ్మీర్ ప్రాంత భద్రతా దళాలు స్థానిక పోలీసుల మధ్య సమర్థవంతమైన సమన్వయంతో 'ఓవర్ గ్రౌండ్ వర్కర్స్' కదిలికల్ని కట్టడి చేస్తూ పాకిస్థాన్, చైనా దుర్బుద్ధులకు ధీటైన సమాధానం ఇస్తూ, ఉగ్ర మూకలను తుదముట్టించాల్సి ఉంటుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# కమతం రామకృష్ణని పరామర్శించిన సాధు రమేష్ రెడ్డి



ఖమ్మం, ఆగష్టు 17 : (నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలం తుమ్మలపల్లి గ్రామంలో కమతం రామకృష్ణ తండ్రి కమతం నరసింహారావు టిడిపి సీనియర్ నాయకులు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి అండగా ఉంటామని హామీనిచ్చిన సాధు రమేష్ రెడ్డి.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబిసి జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, నాయకులు పోలూరి రమేష్, మువ్వ శ్రీనివాస్, మల్లికార్జున రావు, పొన్నం నరేష్, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్.ఐ.ఎన్.ఎల్ లో దేశభక్తి, ఆనందోత్సాహాలతో స్వాతంత్ర్య దినోత్సవం

న్యూఢిల్లీ, ఆగష్టు 17: :భారతదేశ 78వ స్వాతంత్ర్య దినాన్ని (2024 ఆగస్టు 15న) దేశభక్తి పూర్వక ఉత్సాహంతో, సంతోషంతో జరుపుకోవడంలో దేశ ప్రజలతో విశాఖపట్నం ఉక్కు కర్మాగారం కార్పొరేట్ సంస్థ 'ఆర్ఐఎన్ఎల్' మమేకమైంది. ఈ వేడుకలను విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలోని విశాలమైన తృష్ణ మైదానంలో నిర్వహించారు.

ఆర్ఐఎన్ఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సిఎమ్‌డి) శ్రీ అతుల్ భట్ జాతీయ జెండాను ఎగురవేశారు. సిఐఎస్ఎఫ్ సిబ్బంది ఇచ్చిన గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు. అనంతరం సిఐఎస్ఎఫ్ కవాతును ప్రదర్శించారు.

ఈ సందర్భంగా సంస్థ ఉద్యోగులు, కుటుంబ సభ్యులను ఉద్దేశించి శ్రీ అతుల్ భట్ ప్రసంగించారు. ఆర్ఐఎన్ఎల్ లో పని చేస్తున్న ఉద్యోగులకూ, కుటుంబ సభ్యులకూ, సిఐఎస్ఎఫ్ సభ్యులకూ, హోం గార్డులకూ, కంపెనీ సరఫరాదారు సంస్థలకూ, వినియోగదారులకూ, భాగస్వాములకూ, సంబంధిత వర్గాలతో పాటు ఆర్ఐఎన్ఎల్ సంస్థ శ్రేయోభిలాషులందరికీ కూడా శ్రీ అతుల్ భట్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాభినందనలు తెలిపారు.

ప్రపంచ ఆర్థికావృద్ధి గురించి శ్రీ అతుల్ భట్ మాట్లాడుతూ ఆధునిక ఆర్థిక వ్యవస్థల వృద్ధి– 2023 లో 1.6 శాతం ఉండగా, 2024 లో ఇది స్వల్పంగా పెరిగి 1.7 శాతానికి చేరుకుంటుందన్న అంచనా ఉందన్నారు. 2024–25 లో భారతదేశ ఆర్థిక వ్యవస్థ వాస్తవ స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వృద్ధి రేటు 7.2 శాతం గా ఉండవచ్చని భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బిఐ) అంచనా వేసిందని ఆయన అన్నారు.

"ఈ సంవత్సరం ఉక్కు గిరాకీ 1.7 శాతం మేరకు పుంజుకొని 1793 టన్నులకు చేరుకోగలదన్నది 'వరల్డ్ స్టీల్' అంచనా. ఉక్కు గిరాకీ 2025 లో 1.2 శాతం మేరకు వృద్ధి చెంది, 1815 టన్నులకు చేరవచ్చు. 2021 నుంచి ఉక్కు సంబంధ గిరాకీ వృద్ధికి భారతదేశం ప్రధాన చోదక శక్తిగా మారింది. మన దేశంలోని అంచనాల ప్రకారం భారతదేశ ఉక్కు గిరాకీ అంతకంతకూ పెరుగుతూ 2024, 2025 నాటికి 8 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చు. ఉక్కును ఉపయోగిస్తున్న రంగాలు నిరంతర వృద్ధిని సాధిస్తున్నందువల్ల, ప్రత్యేకించి మౌలిక సదుపాయాల రంగంలోకి వచ్చే పెట్టుబడులలో బలమైన వృద్ధి కొనసాగుతున్నందువల్ల ఈ స్థితి సాధ్య పడవచ్చు".

శ్రీ అతుల్ భట్ మాట్లాడుతూ "ప్రపంచ గిరాకీ తో పాటు స్వదేశీ ఉక్కు గిరాకీ నేపథ్యాన్ని పట్టి చూస్తే, ఆర్ఐఎన్ఎల్ తిరిగి బలంగా పుంజుకొనే బాటలో మున్ముందుకు సాగిపోతోంది. ఈ దశలో, ఆర్ఐఎన్ఎల్ తన ఉత్పాదనల శ్రేణిలో వైవిధ్యాన్ని కొనసాగించే వ్యూహాలకు పదును పెట్టుకోవడం పైన, ప్రత్యేక మార్కెట్ పైన, విలువ జోడించిన అధిక ఖరీదైన ఉత్పాదనల తయారీ పైన శ్రద్ధ తీసుకొంటోంది. ఉక్కు మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధి వర్గం గత మే నెలలో కంపెనీ స్థితిని సమీక్షించింది. కేంద్ర ఉక్కు మంత్రి తో పాటు ఉక్కు శాఖ సహాయ మంత్రి కిందటి నెలలో పదవీ బాధ్యతలను స్వీకరించిన వెంటనే, ఆర్ఐఎన్ఎల్ స్థితిని సమీక్షించారు. సంబంధిత బ్యాంకుల ఉన్నతాధికారులతో కూడా చర్చించారు. అనంతరం విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని సందర్శించారు" అని తెలిపారు.

# మహిళలకు బేషరతుగా కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

## – కాంగ్రెస్ నేత పరికపల్లి

ఖమ్మం, ఆగష్టు 17 : (నేటినిజం ప్రతినిధి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహిళల పై చేసినటువంటి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జిల్లా కాంగ్రెస్ నాయకులు పరికపల్లి శ్రీనివాస్ ఖండించారు. ఈ సందర్భంగా పరికపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ...తెలంగాణ ఆడపడుచులు పౌరుషానికి నిదర్శన మైనటువంటి మాతృమూర్తుల ను పట్టుకొని మహాలక్ష్మి స్కీం లో భాగంగా ఫ్రీ బస్సులలో బ్రేక్ డాన్సులు, రికార్డ్ డాన్సు చేసుకోండి అని అనడం సభ్య సమాజం తలదించుకునే లాగా కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణలోని ఆడపడుచు లు అందరూ దీనికి నిరసనగా టిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులను, నాయకులను ఎక్కడికి అక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆగస్టు 15వ తారీకు లోపల రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని గతంలో హరీష్ రావు సవాల్ చేసిన నేపథ్యంలో దమ్ముంటే వెంటనే రాజీనామా చేయాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాము. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన మాట చెప్పినట్టుగా మాట తప్పకుండా హామీ నెరవేర్చామని అన్నారు.

# కలకత్తా మహిళా జూనియర్ డాక్టర్ పై సామూహిక అత్యాచారాన్ని హత్యను ఖండించండి

- నిందితుల్ని ఉరి తీయాలి
- మహిళా చట్టాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలి
- సిట్టింగ్ జడ్జి తో విచారణ చేసి కుటుంబానికి న్యాయం చేయాలి
- ఎన్వి రాకేష్ పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఖమ్మం, ఆగష్టు 17 : (నేటినిజం ప్రతినిధి): కలకత్తా నగరంలో విధులు నిర్వహి స్తున్న జూనియర్ డాక్టర్ పై సభ్య సమాజం తలదించుకునే విధంగా అత్యాచారం అతి దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వి రాకేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కామేపల్లి మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో అత్యాచార బాధితురాలికి నివాళి అర్పించి ఒక నిమిషం మౌనం పాటించారు. ఆత్యాచార ఘటనకు నిరసన వ్యక్తం చేసి ఆయన పాల్గొని మాట్లాడుతూ.. పాలకుల నిర్లక్ష్యం, వైఫల్యాల మూలంగానే అత్యాచార సంఘటన లు పునరావృతం అవుతున్నాయని అన్నారు. మహిళలు, విద్యార్థినీలు బస్సులో ప్రయాణ సందర్భంలో కూలీ అడ్డాలలో, నిర్మానుష ప్రాంతాలలో, విద్యాసంస్థలలో, మార్కెట్, ప్రైవేట్ కంపెనీలలో ఎక్కడ చూసినా మహిళలు అభద్రతా భావానికి గురవుతున్నారని ఎప్పుడు ఎలాంటి సంఘటనలు జరుగుతాయో ఊహించలేని పరిస్థితుల్లో మహిళలు ఉన్నారని ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసిన నిర్భయ చట్టాన్ని తీసుకువచ్చి న ఆత్యాచార నిరోధక చట్టం పూర్తి స్థాయిలో అమలు చేయకపోతే ఇలాంటి దుర్మార్గపు సంఘటన నిలుపుదల చేయడం సాధ్యం కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువకులు మత్తు మందు పదార్థాలకు లోనై విచక్షణా రహితంగా వ్యవహరిస్తూ అత్యాచార సంఘటనలకు పాల్పడుతున్న వైనం అనేక సందర్భాలలో ఉన్నప్పటికీ ప్రభుత్వాలు గంజాయి, డ్రగ్స్, కొకైన్ లాంటి మత్తుపదార్థాలను నిలుపుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన అనేక నష్టాలను మహిళలు చవిచూడాల్సి




వస్తుందని తక్షణమే తగు జాగ్రత్తలు తీసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

కోల్‌కతాలోని ఆర్.జి.కార్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థినిపై జరిగిన అమానుష అత్యాచారం, హత్య జరిగిన వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని, అత్యాచారం చేసి దుర్మార్గంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. సెంట్రల్ ప్రొటెక్ట్ యాక్ట్ లాంటి చట్టాలను తక్షణమే అమలు చేసి మహిళా చట్టాలని ప్రతిష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమానికైనా వెనకాడబోమని వారు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించా రు. ఈ కార్యక్రమంలో నాయకులు అవంతిక, శరణ్య, స్వాతి, నీలిమ, చైతన్య, అఖిల్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# మరో ఏడు కొత్త విమానాశ్రయాలు..

న్యూఢిల్లీ, ఆగష్టు 17: :ఏపీలోని ఏడు విమానాశ్రయాలను 14కు విస్తరించాలనేదే తన లక్ష్యమని పౌర విమానయాన శాఖ కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు . ఢిల్లీ పర్యటనలో ఉన్న ఏపి సిఎం చంద్రబాబు నేటి ఉదయం పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. , ఆ శాఖ మంత్రి , శ్రీకాకుళం ఎంపి రామ్మోహన్ ఆహ్వానం మేరకు అక్కడికి వెళ్లారు. ఏపీలో విమానయాన రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటు, ప్రతిపాదనలపై అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ, ఏపి లో విమాన సర్వీస్ లు పెంచుతామని, ద్వితీయ పట్టణాల నుంచి కూడా త్వరలో సర్వీస్ లు ప్రారంభిస్తామని చెప్పారు..

రాజమహేంద్రవరం, విజయవాడ, కడప విమానాశ్రయాల్లో టెర్మినల్ సామర్థ్యం పెంపు పనులపై సీఎం తో సమీక్ష చేసినట్లు తెలిపారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సీఎం సూచించారని తెలిపారు. ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటుకు భూమిని గుర్తిస్తే తమ శాఖ తరఫున సహకారం అందిస్తామన్నారు. శ్రీకాకుళం, దగదర్తి, కుప్పం, నాగార్జునసాగర్‌లో విమానాశ్రయాల ఏర్పాటుకు గుర్తించినట్టు మంత్రి వివరించారు.

ఈ విషయంలో విమానయాన శాఖ, రాష్ట్రప్రభుత్వం కలిసి ముందుకెళ్తాయన్నారు. విమానాశ్రయాల్లో మౌలికసదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కొత్త ప్రాంతాల్లో భూమి, సాంకేతిక అంశాలు పరిశీలిస్తామన్నారు. పుట్టపర్తి విమానాశ్రయాన్ని ప్రభుత్వ సంస్థగా మార్చేందుకు సీఎంతో చర్చించినట్టు తెలిపారు. ప్రైవేటు విమానాశ్రయ నిర్వాహకులతో చర్చించాల్సి ఉందన్నారు. పౌరవిమానయాన సంస్థగా మారిస్తే సాధారణ కార్యకలాపాలు సాగించవచ్చన్నారు. ఏపీని లాజిస్టిక్ హబ్‌గా చేయాలనేది చంద్రబాబు ఆలోచన అని, లాజిస్టిక్ హబ్‌గా చేయడంలో విమానాశ్రయాల పాత్ర కీలకమన్నారు.

# వైసీపీకి మాజీ ఉప ముఖ్యమంత్రి గుడ్ బై..

అమరావతి, ఆగష్టు 17 :మాజీ మంత్రి ఆళ్ల నాని వైసీపీకి గుడ్ బై చెప్పారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం తొలిసారి మీడియా ముందుకు వచ్చిన ఆళ్ళ నాని వైసీపీలో ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కొద్దిరోజుల క్రితమే ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా, నియోజకవర్గ ఇన్ ఛార్జ్ గా రాజీనామా చేశానని, వ్యక్తిగత కారణాలతో, వ్యక్తిగత బాధ్యతలతో ఇవాళ పార్టీకి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

కొద్దికాలం ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడంతోనే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. భవిష్యత్తు కార్యాచరణపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, వ్యక్తిగత కారణాలతో రాజకీయాలకు దూరంగా ఉండేందుకు నిశ్చయించుకున్నట్టుగా ఆళ్ళనాని స్పష్టం చేశారు.

# జూన్‌లో 3.48 శాతం తగ్గిన జాతీయ బొగ్గు సూచీ

న్యూఢిల్లీ, ఆగష్టు 17: :జాతీయ బొగ్గు సూచీ(తాత్కాలిక అంచనా) గత ఏడాది జూన్‌లో నమోదైన 147.25 పాయింట్లతో పోలిస్తే ఈ జూన్‌లో 3.48% తగ్గి 142.13 పాయింట్లుగా నమోదైంది. ఈ గణనీయమైన తగ్గుదలను గమనిస్తే మార్కెట్ లో డిమాండ్ కు తగినంత బొగ్గు లభ్యత ఉన్నవిషయాన్నితెలియజేస్తోంది.

జాతీయ బొగ్గు సూచీ(ఎన్‌సీఐ) బొగ్గు ధరను సూచిస్తుంది. అన్ని అమ్మకపు మార్గాల నుంచి అనగా నోటిఫైడ్ ధరలు, వేలం ధరలు, దిగుమతి ధరలను మిళితం చేసి ఈ సూచీని తయారు చేస్తారు. నియంత్రిత (విద్యుత్, ఎరువులు), అనియంత్రిత రంగాల్లో వివిధ రకాల కోకింగ్, నాన్ కోకింగ్ బొగ్గు ధరలను ఈ సూచీ పరిగణనలోకి తీసుకుంటుంది.

2017–18 ను ఆధార సంవత్సరంగా తీసుకుని ఈ సూచీ ని తయారుచేశారు. మార్కెట్ పరిస్థితులు, ధరల హెచ్చుతగ్గుల వివరాలను ఇది తెలియజేస్తుంది.

వేలంలో బొగ్గు పలికే ధర పరిశ్రమ స్థాయిని తెలియజేస్తుంది. ఈ ధరల్లో గణనీయమైన తగ్గుదల ఉండటం మార్కెట్లో తగినంత బొగ్గు లభ్యతను సూచిస్తోంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 2024 జూన్‌లో దేశ బొగ్గు ఉత్పత్తిలో 14.58% వృద్ధి నమోదైంది. ఇది బొగ్గుపై ఆధారపడిన వివిధ రంగాలకు స్థిరమైన సరఫరా ఉండటాన్ని నిర్ధారించటమే కాకుండా దేశ ఇంధన భద్రతకు గణనీయంగా దోహదం చేస్తుంది.

ఎన్‌సీఐలో తగ్గుదల మరింత సమతౌల్య మార్కెట్‌ను..సరఫరా, డిమాండ్ సమన్వయాన్ని కూడా సూచిస్తోంది. బొగ్గు లభ్యత సరిపడా ఉండటంతో దేశంలో పెరుగుతోన్న డిమాండ్ సమస్య పరిష్కారమవటమే కాకుండా, దీర్ఘకాలిక ఇంధన అవసరాలు కూడా తీరనున్నాయి. తద్వారా బొగ్గు లభ్యత విషయంలో ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా, దేశ సంపన్న భవిష్యత్తుకు ధీమా కలగజేస్తుంది.

# పశ్చిమ బెంగాల్‌లోని బాగ్డోగ్రా విమానాశ్రయంలో రూ.1549 కోట్ల అంచనా వ్యయంతో నూతన పౌర విమానయాన సదుపాయం

న్యూఢిల్లీ, ఆగష్టు 17: :ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. రూ.1549 కోట్ల అంచనా వ్యయంతో పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురిలోని బాగ్డోగ్రా విమానాశ్రయంలో పౌర విమానయాన సదుపాయం అభివృద్ధి చేసేందుకు భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ(ఏఏఐ) చేసిన ప్రతిపాదనకు మంత్రివర్గ సంఘం ఆమోదం తెలిపింది.

ప్రతిపాదిత కొత్త ఇంటిగ్రేటెడ్ టర్మినల్ భవనం 70,390 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏకకాలంలో రద్దీ సమయాల్లో 3000 మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యంతో రానుంది. దీని వార్షిక సామర్థ్యం 10 మిలియన్ల మంది ప్రయాణికులు.

ఏ–321 రకం ఎయిర్‌క్రాఫ్ట్‌లకు అనువైన 10 పార్కింగ్ బేలు, అలాగే రెండు లింక్ టాక్సీవేలు, మల్టీ–లెవల్ కార్ పార్కింగ్‌లను ఏర్పాటు చేయగల సామర్థ్యం కలిగిన ఒక అప్రాన్ నిర్మాణం ఈ ప్రాజెక్టు ముఖ్య భాగాలు. పర్యావరణ బాధ్యతను నొక్కి చెబుతూ, టెర్మినల్ భవనం గ్రీన్ బిల్డింగ్‌గా ఉంటుంది,

పునరుత్పాదక ఇంధన వనరులను ఏకీకృతం చేస్తుంది. పర్యావరణ దుష్పరిణామాలను తగ్గించడానికి సహజ కాంతిని పెంచుతుంది.

ఈ కొత్త నిర్ణయం బాగ్డోగ్రా విమానాశ్రయం ఆపరేషన్ సామర్థ్యాన్ని, ప్రయాణీకుల అనుభవాన్ని గణనీయంగా మెరుగుపరచడానికి సిద్ధంగా ఉంది, ఈ ప్రాంతానికి కీలకమైన విమాన ప్రయాణ కేంద్రంగా దాని పాత్రను బలోపేతం చేస్తుంది.

# బిహార్‌లోని బిహ్తాలో రూ.1413 కోట్ల అంచనా వ్యయంతో నూతన పౌర విమానయాన సదుపాయానికి కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగష్టు 17: :ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ బీహార్ పాట్నాలోని బిహ్తాలో రూ.1413 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా పౌర విమానయాన సదుపాయం అభివృద్ధి చేసేందుకు భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ(ఏఏఐ) చేసిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది.

ప్రయాణికుల నిర్వహణ సామర్థ్యం విషయంలో పాట్నా విమానాశ్రయం గరిష్ట స్థాయిని చేరుకుంటుందన్న అంచనాల మధ్య వ్యూహాత్మకంగా ఈ ప్రాజెక్టును తీసుకురానున్నారు.

ఏఏఐ ఇప్పటికే పాట్నా విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ భవనాన్ని నిర్మించే పనిలో ఉండగా, పరిమిత భూ లభ్యత కారణంగా మరింత విస్తరణకు ఆటంకం ఏర్పడనుంది.

బిహ్తా విమానాశ్రయంలో ప్రతిపాదిత కొత్త ఇంటిగ్రేటెడ్ టర్మినల్ భవనం 66,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏకకాలంలో రద్దీ సమయాల్లో 3000 మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యంతో రానుంది. వార్షికంగా 50 లక్షల మంది ప్రయాణికులకు ఈ టర్మినల్ సేవలు అందించనుంది. అవసరమైతే దీని సామర్థ్యాన్ని వార్షికంగా మరో 50 లక్షల ప్రయాణికులకు విస్తరించొచ్చు. అంతిమంగా సంవత్సరానికి కోటి మంది ప్రయాణీకుల నిర్వహణ సామర్థ్యం దీనికి ఉండనుంది. ఏ–321/బీ–737–800/ఏ–320 రకం విమానాలకు అనువైన 10 పార్కింగ్ సదుపాయాలు, అలాగే రెండు వాహన మార్గాల(లింక్ టాక్సీవే)ను ఇక్కడ నిర్మించనున్నారు.

# ఉత్తమ నాన్ ఫీచర్ ఫిల్మ్ అవార్డును దక్కించుకున్న అయేనా (మిర్రర్). ఉత్తమ డాక్యుమెంటరీగా 'మర్మర్స్ ఆఫ్ ది జంగిల్'

న్యూఢిల్లీ, ఆగష్టు 17: :ఫీచర్ చిత్రాల జ్యూరీ చైర్ పర్సన్ రాహుల్ రవైల్, నాన్ ఫీచర్ చిత్రాల జ్యూరీ చైర్ పర్సన్ శ్రీ నీలా మాధబ్ పాండా, ఉత్తమ సినీ రచన జ్యూరీ చైర్ పర్సన్ శ్రీ గంగాధర్ ముదలియార్ ఇతర జ్యూరీ సభ్యులు కేంద్ర రైల్వే శాఖ, సమాచార, ప్రసార శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ను కలిసి 2022 సంవత్సరానికి గాను 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల అవార్డు విజేతల జాబితాను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డా. ఎల్ మురుగన్, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు, సంయుక్త కార్యదర్శి (చలనచిత్రాలు) వృందా దేశాయ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జ్యూరీలో భారతీయ సినీరంగంలోని ప్రఖ్యాత దర్శకులు, సినీ ప్రముఖులు ఉన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి (చలనచిత్రాలు) శ్రీమతి బృందా దేశాయ్ సమక్షంలో ఫీచర్ చిత్రాల జ్యూరీ చైర్ పర్సన్ రాహుల్ రవైల్, నాన్ ఫీచర్ చిత్రాల జ్యూరీ చైర్ పర్సన్ శ్రీ నీలా మాధబ్ పాండా, ఉత్తమ సినీ రచన జ్యూరీ చైర్ పర్సన్ శ్రీ గంగాధర్ ముదలియార్ అవార్డులను ప్రకటించారు.

70వ జాతీయ చలన చిత్రోత్సవాల్లో ఉత్తమ చిత్రంగా ఆనంద్ ఏకార్షి దర్శకత్వం వహించిన ఆట్టమ్ (ది ప్లే) ఎంపిక కాగా, ఉత్తమ నాన్ ఫీచర్ ఫిలింగా సిద్ధాంత్ సరీన్ దర్శకత్వం వహించిన అయేనా (మిర్రర్) చిత్రానికి పురస్కారం లభించింది.

అనిరుద్ధ భట్టచార్జి, పార్థివ్ ధార్ రచించిన "కిశోర్ కుమార్: ది అల్టిమేట్ బయోగ్రఫీ"కి ఉత్తమ సినీ పుస్తకంగా అవార్డు పొందింది.

సంపూర్ణ వినోదాన్ని అందించే విభాగంలో ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా కాంతార పురస్కారాన్ని గెలుపొందింది.

'కాంతార' చిత్రంలో నటనకు గాను రిషబ్ శెట్టికి ఉత్తమ నటుడిగా, తిరుచిత్రాంబళం చిత్రానికి ఉత్తమ నటిగా నిత్యామీనన్ పురస్కారాన్ని గెలుపొందారు.

ఉత్తమ సహాయ నటుడి విభాగంలో పవన్ రాజ్ మల్హోత్రా, ఉత్తమ సహాయ నటిగా నీనా గుప్తా ఎంపికయ్యారు.

వీఎఫ్ఎక్స్ సూపర్ వైజర్లతో కలిసి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఏవీజీసీ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ గేమింగ్ అండ్ కామిక్) విభాగంలో ఉత్తమ చిత్రంగా బ్రహ్మాస్త్ర పార్ట్ 1: శివ అవార్డును గెలుచుకుంది. ఈ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించగా, జయకర్ ఆరుద్ర, విరాల్ టక్కర్, నీలేష్ గోరే వీఎఫ్ఎక్స్ పర్యవేక్షకులుగా ఉన్నారు.

# అసెంబ్లీకి రండి.. మాట్లాడే అవకాశం ఇస్తాం..

## -జగన్ కు స్పీకర్ అయ్యన్న పిలుపు
## -ప్రతిపక్ష హోదాపై చట్ట ప్రకారం వెళ్తా
## -బయట కంటే అసెంబ్లీలో మాట్లాడితే మీ మాటలకు విలువ
## -సమావేశాలలో పాల్గొనండి..వైసిపి ఎమ్మెల్యేకు హితవు

తిరుపతి, ఆగష్టు 17 :వైసిపి అధినేత జగన్ కాని.. వైసీపీ ఎమ్మెల్యేలు కానీ.. మీడియాలో మాట్లాడటం కాదని .. అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని సూచించారు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు .. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కోరితే సభాపతిగా తాను తప్పకుండా మాట్లాడే అవకాశం ఇస్తానన్నారు. తిరుపతి ఎస్వీ జూపార్కును నేడు సందర్శించిన స్పీకర్ , స్థానిక ఎమ్మెల్యేతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక, అసెంబ్లీ లో 80 మంది కొత్తగా ఎమ్మెల్యేలు అయ్యారని.. వారందరికీ ప్రత్యేక శిక్ష తరగతులు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించడానికి చర్యలు చేపడుతామని.. అపార్ట్మెంట్, మిద్దెల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇచ్చేలా సూచనలు చేస్తాన్నారు. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలను ప్రజలు నిలదీయ్యాలని, .. అలాంటి వారిని ప్రశ్నించాలని సచించారు అయ్యన్న.

### మొక్కలు పెంచండి..

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.. పచ్చదనాన్ని పెంపొందిస్తూ ప్రతి ఇంటా రెండు మొక్కలు నాటేలా ప్రభుత్వం ప్రోత్సహించాలి అన్నారు.. పచ్చదనాన్ని పెంపొందించకపోతే మానవ మనగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది అని హెచ్చరించారు.. వాతావరణంలో ప్రకృతి వైపరీత్యాల లోపం వల్లే అనేక ప్రమాదాలు వాటిల్లుతున్నాయి. అపార్మెంట్లలో కూడా చిన్నచిన్న మొక్కల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పంచాయతీలలో నర్సరీలోని ఏర్పాటు చేసి, తద్వారా మొక్కల పెంపకాన్ని మహిళా సంఘాలకుఅప్పగిస్తూ తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి సూచిస్తాను అన్నారు స్పీకర్ .

# వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు సాకారం

న్యూఢిల్లీ, ఆగష్టు 17: :కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఆగష్టు 16న ,ఉభయ మంత్రిత్వశాఖలకు చెందిన స్వీపర్లు, ఎం.టి.ఎస్ నుంచి కార్యదర్శి స్థాయివరకు గల ఉద్యోగులు, అధికారులతో సమావేశం నిర్వహించారు.

వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ సహాయమంత్రి శ్రీ భగీరథ్ చౌదరి, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి శ్రీ కమలేష్ పాశ్వాన్, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.

స్వాతంత్ర్యదినోత్సవం మరుసటి రోజున శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది తో పాటు, ఐకార్ సిబ్బందితో సమావేశమయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ, ఎర్రకోటనుంచి చేసిన ప్రసంగంలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి సంబంధించి ప్రకటించిన దార్శనికతను సాకారం చేసేందుకు ఆయన ప్రతిజ్ఞ చేశారు. 2047 కు రూపొందించిన రోడ్ మ్యాప్ ను, అభివృద్ధి చెందిన దేశంగా భారత్ లక్ష్యాన్ని సాకారం చేయడానికి తామందరం గట్టి కృషి చేయడం తోపాటు, కష్టపడి పనిచేద్దామన్నారు. ఈ కల సాకారం కావడానికి మూడురెట్లు పని జరగాల్సి ఉందని ప్రధానమంత్రి తమ ప్రసంగంలో చెప్పారని గుర్తు చేస్తూ, ప్రధానమంత్రి మార్గనిర్దేశంలో మూడురెట్లు కష్టించి పనిచేద్దామని అన్నారు.

'మనమంతా ఒకే కుటుంబం, మనం కలిసి పనిచేద్దాం' అని శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. పూర్తి నిజాయితీ, అంకిత భావంతో పనిచేస్తామంటూ ఆయన ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా ఉద్యోగులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. 'కష్టపడి పనిచేసి ,నిజాయితీ, అంకితభావంతో తమ శక్తియుక్తులన్నీ ఉపయోగించి వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి ద్వారా అభివృద్ధి చెందిన భారత్ ను సాధించేందుకు మేం కృషి చేస్తాం' అంటూ ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అభివృద్ధిచెందిన భారత్ ను సాకారం చేయడంలో గ్రామీణాభివృద్ధి విభాగం కీలక పాత్ర పోషించాలని అంటూ ఆయన, మనం నిజాయితీతో, కష్టపడి పనిచేద్దామని అన్నారు.

# వెంకయ్య నాయుడి సేవలు ప్రశంసనీయం - ఉప రాష్ట్రపతి

## -గ్రామీణ భారతానికి ట్రస్ట్ ప్రాధాన్యం
## -ప్రజా సంక్షేమం కోసమే వెంకయ్య జీవితం
## -స్వర్ణ భారత్ ట్రస్ట్ వార్షికోత్సవంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్..



అమరావతి, ఆగష్టు 17 :సంక్షేమ కార్యక్రమాల కోసం వెంకయ్యనాయుడు జీవితం అంకితం చేశారని, . గ్రామీణ భారతంలో సేవకు ఆయన అంకితమయ్యారని ప్రశంసించారు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్?.. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టు 23వ వార్షికోత్సవ సభలో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. .. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వెంకయ్యనాయుడి వంటి సామాజిక వేత్తల వల్ల సమరయోధుల కలలు నేడు సాకారమవుతున్నాయని కొనియాడారు. అలాగే స్వర్ణ భారతి ట్రస్ట్ గ్రామీణ ప్రాంతాలకు చేస్తున్న సేవలపై ప్రశంసలు కురిపించారు..

కాగా, : భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ శనివారం ఉదయం నెల్లూరు జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వెంకటాచలంలో ఉన్న అక్షర విద్యాలయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి దంపతులకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ ఘన స్వాగతం పలికారు.

అక్షర విద్యాలయం ఆవరణలో ఉన్న స్వామి వివేకానందుని ప్రతిమకు ఉపరాష్ట్రపతి నివాళులు అర్పించారు. అనంతరం అక్షర విద్యాలయం ఆవరణలో ఉన్న సర్దార్ వల్లభ భాయ్ పటేల్ విగ్రహానికి కూడా జగదీప్ ధన్ఖడ్ నివాళులర్పించారు. ఆపై అక్షర విద్యాలయంలోని చిన్నారులతో ముచ్చటించారు. వారి సాంస్కృతిక కార్యక్రమాలు ఉపరాష్ట్రపతి, పూర్వ ఉపరాష్ట్రపతి తిలకించారు. ఉపరాష్ట్రపతితో పాటు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అక్షర విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు.

కాగా.. జిల్లాలో పర్యటన నిమిత్తం ఈ రోజు ఉదయం శంషాబాద్ హైదరాబాద్ లోని శంషాబాద్ విమానాశ్రయానికి ఉపరాష్ట్రపతి చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి నెల్లూరులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా వెంకటాచలంలోని అక్షర విద్యాలయం చేరుకున్నారు.. ఆ కార్యక్రమం అయిన వెంటనే ఆయన హెలికాప్టర్ లో తిరిగి శంషాబాద్ కు చేరుకున్నారు. న్యూఢిల్లీ బయలుదేరిన ఉప రాష్ట్రపతికి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ శర్మ, రాష్ట్ర రవాణా, బీ.సి.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు హర్కారా వేణుగోపాల్, రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, రంగ రెడ్డి జిల్లా కలెక్టర్ తదితరులు కలిసి ఘనంగా వీడ్కోలు పలికారు.

# మంత్రి జూపల్లికి స్వపక్షం నుంచే అసమ్మతి సెగలు..



మహబూబ్‌నగర్, ఆగష్టు 17 :జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావుకు నిరసన సెగలు తాకాయి. మంత్రి జూపల్లి కృష్ణారావు కాన్వాయ్ ను అడ్డుకున్నారు కాంగ్రెస్ పార్టీ సరితా తిరుపతయ్య వర్గం వారు. మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య ఇంటిలో మంత్రి జూపల్లి కృష్ణారావు చర్చలు జరిపిన అనంతరం ప్రాజెక్టుల సందర్శనకు వెళ్లారు మంత్రి, సరితా తిరుపతయ్య.

వివరాల్లోకి వెళితే.. ఇవాళ ఉదయం గద్వాల జిల్లా కేంద్రానికి మంత్రి జూపల్లి కృష్ణారావు చేరుకొని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి నివాసానికి వెళ్లారు. మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి గద్వాల నియోజకవర్గంలోని ధరూరు మండలంలోని ర్యాలంపాడు రిజర్వాయర్, గూడెందొడ్డి రిజర్వాయర్, గట్టు ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించడానికి వెళుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు కాన్వాయ్ ను గంజి రోడ్డు సమీపంలో కాంగ్రెస్ పార్టీ మాజీ జడ్పీ చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య వర్గం అడ్డుకున్నారు.

ప్రతిసారి మంత్రి జూపల్లి కృష్ణారావు గద్వాల ప్రాంతానికి వచ్చినప్పుడల్లా సరిత తిరుపతయ్య వర్గం వారికి అవమానాలకు గురి చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించడం లేదని సరితా తిరుపతయ్య వర్గం మంత్రి జూపల్లి కాన్వాయ్ ను అడ్డుకోవడం జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు సరిత తిరుపతయ్య నివాసానికి చేరుకొని సుమారు అరగంట పాటు సరిత తిరుపతయ్య నివాసంలో చర్చలు జరిపారు.

అనంతరం సరిత తిరుపతయ్య మాట్లాడుతూ.. మంత్రి జూపల్లి కృష్ణారావు గద్వాల ప్రాంత అభివృద్ధి కార్యక్రమాలకు వచ్చారని వారిని మనం అడ్డుకోకూడదని, మన ప్రాంత అభివృద్ధి కోసం వచ్చినప్పుడు మనం అందరం సహనంతో ఓర్పుతో సహకరించాలని కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడూ అందరం పార్టీ కోసం పని చేస్తామని, ఏదైనా మన సమస్యను ఉంటే మంత్రి దృష్టికి తీసుకువెళ్లి దాని పరిష్కరించే విధంగా మనం ప్రయత్నం చేయాలి కానీ అభివృద్ధి కార్యక్రమాలకు వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావును అడ్డుకోవడం సబబు కాదన్నారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ? సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో సరితా తిరుపతయ్య వర్గం వారు శాంతించారు. అనంతరం మంత్రితో పాటు సరితా తిరుపతయ్య ప్రాజెక్టుల సందర్శనకు వెళ్లారు.

# అర్హులకు పోడు పట్టాల అందించేందుకు పటిష్ట కార్యాచరణ

## -రాష్ట అటవీ పర్యావరణ దేవాదాయల శాఖ మంత్రి కొండా సురేఖ.

సంగారెడ్డి ఆగష్టు 17(నేటి నిజం ప్రతినిధి) అర్హులకు పోడు పట్టాల అందించేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని రాష్ట్ర అటవీ ,పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కోండా సురేఖ తెలిపారు.

శనివారం రాష్ట్ర అటవీ ,పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దాసరి అనసూయ (సీతక్క) తో కలిసి , పోడు భూముల పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు , ఇంచార్జ్ గిరిజన సంక్షేమ అధికారి అఖిలేష్ రెడ్డి తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

రాష్ట్రంలో అటవీ భూముల విస్తీర్ణం, ×ఆర్.ఓ.ఎఫ్.ఆర్ చట్టం,× జారీ చేసిన పోడు భూముల పట్టాలు, పెండింగ్ ఉన్న దరఖాస్తులు మొదలగు వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉన్నత అధికారులు వివరించారు.

ఆర్ ఓ ఎఫ్ ఆర్ చట్టం ప్రకారం 13 డిసెంబర్ 2005 నాటికి సాగు చేస్తున్న గిరిజనులు, లేదా 13 డిసెంబర్ 2005 నాటికి మూడు తరాలపాటు సాగు చేసిన గిరిజనేతరులకు పోడు భూముల పట్టా పంపిణీ అర్హులని అధికారులు పేర్కొన్నారు. మన రాష్ట్రంలో ఇప్పటి వరకు 2,30,735 మంది అర్హులను గుర్తించి వారికి 6,69,676 ఎకరాల అటవీ భూమి పట్టాలు పంపిణీ చేశామని తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ ,పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కోండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు ఆమోదించిన ఆర్ఓఎఫ్ఆర్ దరఖాస్తుల పట్టాలు లబ్ధిదారునికి చేరాయో లేదో నివేదిక అందించాలని అధికారులకు సూచించారు.

మన రాష్ట్రంలో ఇప్పటివరకు పంపిణీ చేసిన పోడు పట్టాల వివరాలు, పెండింగ్ ఉన్న దరఖాస్తులు, ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో సాగు జరుగుతున్న అటవీ భూముల వివరాలతో కూడిన నివేదిక అటవీశాఖ, గిరిజన శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా రూపొందించి సమర్పించాలని మంత్రి ఆదేశించారు.

పోడు భూముల పట్టా కోసం పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అర్హత ఉంటే వారికి పట్టా పంపిణీకి చర్యలు తీసుకోవాలని, సదరు దరఖాస్తును తిరస్కరించే పక్షంలో దానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేస్తూ నివేదిక అందించాలని అన్నారు.

ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ప్రకారం గతం నుంచి సాగు చేసుకుంటున్నా అటవీ భూములకు మాత్రమే పట్టాలు అందించాలని, కొత్తగా రాష్ట్రంలో ఇంచ్ అటవీ భూమి కూడా సాగు చేయడానికి వీలు లేదని, అటవీ భూముల సంరక్షణకు అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ఎక్కడా నూతన ఆక్రమణలు జరగడానికి వీలులేదని మంత్రి స్పష్టం చేశారు.

ఆర్ఓఎఫ్ఆర్ చట్టం పై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని, తెలంగాణ రాష్ట్ర గిరిజనులకు, ఆదివాసీలకు మాత్రమే పట్టాలు మంజూరు చేయాలని, వలస వచ్చి నూతనంగా అటవీ ప్రాంతంలో చెట్లు నరికివేత చేయాలని చూస్తే కఠినంగా వ్యవహరించాలని మంత్రి పేర్కొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న ×రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దాసరి అనసూయ (సీతక్క)× మాట్లాడుతూ, గిరిజనులకు అటవీశాఖ వ్యతిరేకం అనే భావన తొలగించే విధంగా అధికారులు పని చేయాలని అన్నారు. కొత్తగా అడవుల నరికివేత జరగకుండా అటవీ శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అటవీ భూములు చెట్ల నరికివేత వల్ల కలిగే నష్టాలను విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి తెలిపారు. అటవీ భూముల్లోనీ అటవీ సంపద అక్రమ రవాణా జరుగకుండా పక్కా నిఘా ఏర్పాటు కావాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్ పోడు భూముల పట్టా దరఖాస్తులను, మరోసారి పరిశీలించాలని సూచించారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్ట ప్రకారం అర్హులందరికీ పట్టాలు అందజేయాలని తెలిపారు.

అటవీ భూముల అనుమతుల కారణంగా గిరిజన, ఆదివాసీ ప్రాంతాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రోడ్డు సౌకర్యం, త్రాగు నీరు , ఆసుపత్రి వంటి మౌలిక వసతుల కల్పన పనులకు అటవీ అనుమతులు త్వరగా వచ్చేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రి ఆదేశించారు.

పట్టాలు మంజూరు చేసిన పోడు భూములలో రైతులు పామ్ ఆయిల్, జీడి మామిడి తోటలు మొదలగు లాభదాయక పంటలు సాగు చేసేలా రైతులకు అవసరమైన సహకారాలు, సూచనలు అందించాలని మంత్రి తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మారుతున్న జనరేషన్ మైండ్ సెట్.. ఫెర్రారీ లేదా లంబోర్ఘినీ మోడల్.. భారత్‌లో లగ్జరీ కార్లకు ఫుల్ గిరాకీ

న్యూఢిల్లీ, ఆగష్టు 17: : ప్రతి ఒక్కరూ పర్సనల్ మొబిలిటీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. స్పేసియస్ గా ఉండే ఎస్‌యూవీలు, మిడ్ సైజ్ ఎస్‌యూవీలు, ఎంపీవీలపై మోజు పారేసుకుంటున్నారు. అలాగే అన్ని రకాల సౌకర్యాలు గల లగ్జరీ కార్ల కొనుగోళ్లు ఏయేటికాయేడు పెరుగుతూనే ఉన్నాయి. వరుసగా మూడో ఏడాది సూపర్ లగ్జరీ కార్ల విక్రయాల్లో సరికొత్త రికార్డు నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కార్ల తయారీ సంస్థలు తమ వద్ద ఉన్న నిల్వలను క్లియర్ చేసుకోవడానికి భారీ డిస్కౌంట్లు కూడా ఆఫర్ చేస్తున్నాయి.

కానీ ఇటలీ కార్ల తయారీ సంస్థ 'లంబోర్ఘిని' కారు ఇప్పుడు బుక్ చేసుకుంటే 2026లో గానీ, ఆ తర్వాత గానీ డెలివరీ అవుతుంది. ఇటలీ రాజధాని రోమ్ నగరంలోని లంబోర్ఘిని కార్ల తయారీ సంస్థలో తయారైన కార్లన్నీ ఇప్పటికే భారత్ కే కేటాయించింది. భారత్ లో హురాకెన్ , ఉరుస్, రెవ్యూల్టో వంటి మోడల్ కార్లు లంబోర్ఘిని విక్రయిస్తోంది. వీటిల్లో ఒక్కో కారు ధర రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల మధ్య పలుకుతుంది.

ఇక ఫెర్రారీ, మెక్ లారెన్స్, ఆస్టన్ మార్టిన్ వంటి సంస్థల సూపర్ కార్లకు భారత్ లో బాగానే గిరాకీ ఉంది.

రూ.2.5 కోట్ల నుంచి రూ.4.55 కోట్ల మధ్య ధర పలికే ఎఎంజీ జీ63, , ఆర్ఎస్ క్యూ8 మోడల్ మెర్సిడెజ్ బెంజ్, ఆడి కార్ల కోసం ఏడాది వెయిటింగ్ పీరియడ్ ఉంటుంది. రూ.4 కోట్ల విలువైన కార్లు 2021లో 300 యూనిట్లు అమ్ముడైతే, 2022లో 450కి, 2023లో 1000కి పెరిగాయి. ఈ ఏడాది 1200 నుంచి 1300 మధ్య సూపర్ లగ్జరీ కార్లు అమ్ముడవుతాయని అంచనా వేస్తున్నారు.

భారతీయుల్లో జనరేషన్ మైండ్ సెట్ మారుతోందని లంబోర్ఘిని సీఈఓ స్టీఫాన్ వింకెల్ మాన్ చెప్పారు. అందువల్లే లగ్జరీ కార్లకు గిరాకి పెరుగుతుందన్నారు. అయితే ఇతర మార్కెట్లతో పోలిస్తే భారత్ లో వృద్ధిరేటు సంకేతాలు కనిపిస్తున్నాయన్నారు.

2022 సేల్స్ తో పోలిస్తే 2023లో 12 శాతం వృద్ధితో 103 యూనిట్ల లంబోర్ఘిని కార్లు అమ్ముడయ్యాయి.

# ఎక్కువగా ఫిర్యాదులు సీవరేజీ సమస్యలవే

## -జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 17 : సాంకేతిక పరిజ్ఞానంతో సీవరేజీ సమస్యలను పరిష్కరిస్తామని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామాంతాపూర్‌లోని రాంరెడ్డినగర్ నుంచి ఉప్పల్ నల్లచెరువు వరకు ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ట్రంక్‌లైన్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు.

చాలా కాలం కిందట నిర్మించిన లైన్లలో ఇబ్బందులను తొలగించేలా చూడాలని ఉప్పల్ కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి ఎండీ దృష్టికి తీసుకొచ్చారు. కాల్ సెంటర్‌కు ప్రతి రోజూ 2వేల 500 ఫిర్యాదులు వస్తున్నాయని, అందులో 1400 కాల్స్ సీవరేజీకి సంబంధించినవే ఉంటున్నాయని జలమండలి ఎండీ చెప్పారు. ప్రాధాన్యతల వారీగా సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు.

# స్వర్గేట్ నుంచి కాత్రజ్ వరకూ 5.46 కిలోమీటర్ల మేర పుణే మెట్రో మొదటి దశ ప్రాజెక్ట్ పొడిగింపునకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం

న్యూఢిల్లీ, ఆగష్టు 17: :ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలో సమావేశమైన మంత్రి మండలి పుణే మెట్రో మొదటి దశ ప్రాజెక్ట్ పొడిగింపునకు ఆమోదం తెలిపింది. పూణే మెట్రో ఫేజ్-1లో భాగంగా ప్రస్తుతం ఉన్న పీసీఎంసీ -స్వర్గేట్ మెట్రో లైన్ ను స్వర్గేట్ నుంచి కాత్రజ్ వరకు భూగర్భ మార్గాన్ని విస్తరిస్తారు. 5.46 కిలోమీటర్లున్న ఈ మార్గాన్ని లైన్-1 బీగా పిలుస్తా రు. ఇందులో మూడు భూగర్భ స్టేషన్లు ఉంటాయి. కీలక ప్రాంతాలైన మార్కెట్ యార్డ్, బిబ్వేవాడి, బాలాజీ నగర్, కాత్రజ్ సబర్బన్ ప్రాంతాలను అనుసంధానిస్తారు.పుణేలో ఎలాంటి అడ్డంకులూ లేని ప్రయాణ సౌకర్యాన్ని అందించడానికి ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఇది 2029 ఫిబ్రవరి నాటికి అందుబాటులోకి వస్తుంది.

ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.2954.53 కోట్లు కాగా, దీనిని కేంద్ర ప్రభుత్వం, మహారాష్ట్ర ప్రభుత్వం సమానంగా సమకూర్చుతాయి. ఇందులో ఇరు పక్షాలకు చెందిన సంస్థలు కూడా నిధులు సమకూర్చుతాయి.స్వర్గేట్ మల్టీ మోడల్ హబ్ తో కలిసి ఉండే ఈ విస్తరణ వల్ల మెట్రో స్టేషన్, ఎంఎస్ ఆర్టీసీ బస్టాండ్, పిఎంపిఎంఎల్ బస్టాండ్ లు కూడా అనుసంధానం అవుతాయి. పూణే వాసులకూ, పూణేకు వచ్చే వారికీ ప్రయాణం సులభసాధ్యం అవుతుంది.

దీనిద్వారా పుణే దక్షిణ ప్రాంతం దాదాపు పూర్తిగా, ఉత్తర, తూర్పు, పశ్చిమ ప్రాంతాలకు జిల్లా కోర్టు ఇంటర్ ఛేంజ్ స్టేషన్ మీదుగా అనుసంధానం పెరుగుతుంది. పూణేలో తిరిగేందుకూ, పూణే నుంచి బయటకు వెళ్లే వారికి కూడా

స్వర్గేట్ నుంచి కాత్రజ్ వరకు నిర్మిస్తున్న ఈ భూగర్భ మార్గం కారణంగా ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయి. ప్రమాదాలు, కాలుష్య నివారణ, ప్రయాణ సమయాన్ని తగ్గించడం ద్వారా భద్రమైన, మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుంది.

# మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నిర్వహించే పరుగులో పాల్గొనండి.

## -వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా.



హన్మకొండ, ఆగష్టు 17(నేటినిజం ప్రతినిధి) వరంగల్ కమిషనరేట్ పోలీసుల అధ్వర్యంలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న 4కె పరుగులో యువత, విద్యార్థులు ఉత్సహంగా పాల్గోనాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. ఈ పరుగుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ ఓ ప్రకటన విడుదల చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తరువాత అతి పెద్ద నగరంమైన వరంగల్ నగరంలో ప్రారిశ్రామిక అభివృద్ధితో పాటు, వివిధ వ్యాపార కేంద్రాల ఎర్పాటు, వీటితో పాటు అతి త్వరితకాలంలో వరంగల్ ట్రై సిటి ఎడ్యూకేషన్ హబ్‌గా మారడంతో ట్రై సిటి పరిధిలో పాఠశాలల చదువు మొదలుకొని వైద్య, ఇంజనీరింగ్ లాంటి ఉన్నత విద్య, ఉపాధి అవకాశాల కొసం యువత వారి సొంత పూర్లను వదిలి వరంగల్‌కు చేరుకుంటున్నారు. కాని చేరిన యువత, విద్యార్థులు కొంత మంది వ్యక్తుల స్వార్థం కారణంగా యువతకు మత్తు పదార్థాలకు బానిసలు మారుతున్నారు. దీనితో మత్తు పదార్థాల నిర్మూలించి మత్తు పదార్థాల రహిత వరంగల్ కమిషనరేట్‌గా గుర్తింపు తీసుకరావడంతో పాటు యువత మత్తు పదార్థాలకు దూరం చేసి, వారిలో భవిష్యత్తు చిరుగించడం కొసం మత్తు పదార్థాలపై యువత, విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం వరంగల్ కమిషనరేట్ పోలీసుల అధ్వర్యంలో ఈ నెల 18 వ తేది ఆదివారం రోజున ఉదయం 7గంటలకు వరంగల్ పోలీస్ పరెడ్ గ్రౌండ్ నుండి 4కె పరుగును ప్రారంభించబడుతుందని. మత్తు పదార్థాలను సమూలంగా నాశనం చేసే లక్ష్యంగా చేసే ఈ పరుగులో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ కళాశాలు, పాఠాశాలు చెందిన విద్యార్థులు, స్థానిక యువత ఈ 4కె పరుగులో ఉత్సహం పాల్గోని, యువతలో స్ఫూర్తి నింపాలని పోలీస్ కమిషనర్ యువతకు సూచించారు. ఈ పరుగులో మొదటగా వచ్చిన ముగ్గురుకి 5వేలు, మూడువేలు, రెండు వేలు చోప్పున నగదు పురస్కారాలు అందజేయడం జరుగుతుందని. ఈ పరుగులో జాతీయ స్థాయి క్రీడాకారులతో పాటు, తెలంగాణకు చెందిన ప్రముఖులు, కళాకారులు పాల్గోంటారని పోలీస్ కమిషనర్ తెలియజేసారు.

# వైద్యుల సమ్మెకు గమన్ హాస్పిటల్స్ మద్దతు..




హైదరాబాద్, ఆగష్టు 17 : కోల్‌కాతా లోని ఓ ట్రైనీ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఇచ్చిన 24 గంటల దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా గమన్ హాస్పిటల్స్ ఈరోజు ఔట్ పేషెంట్ సేవలు, శస్త్రచికిత్సలను నిలిపివేసింది. అత్యవసర సేవలు యథావిధిగా కొనసాగించింది.

కాగా, బాధితురాలికి న్యాయం, వైద్య నిపుణులకు మెరుగైన రక్షణ కోరుతూ గమన్ హాస్పిటల్స్ వైద్యులు, సిబ్బంది శనివారం హైదరాబాద్ లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గమన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నంద కిషోర్ మాట్లాడుతూ, కోల్ కతా ఘటనను ఖండించారు.

తాము ఐఎంఏ ఇచ్చిన సమ్మె పిలుపునకు సంఘీభావం తెలుపుతున్నామన్నారు అలాగే బాధితురాలికి న్యాయం జరిగే విషయంలో ఐఎంఏ తీసుకున్న చర్యలను బలపరుస్తున్నామని చెప్పారు. వైద్యుల భద్రత, ముఖ్యంగా శిక్షణలో ఉన్నవారి భద్రత చాలా ముఖ్యం అని ఆయన అన్నారు.

ఈ ర్యాలీకి డాక్టర్ కిషోర్, హాస్పిటల్ డైరెక్టర్లు భాస్కర్ రావు, ఇందీవర్ రెడ్డి నేతృత్వంలో వహించారు.. డాక్టర్ లవకుమార్ రెడ్డి, డాక్టర్ భరత్, డాక్టర్ తిరుపతి లతో సహా పలువురు వైద్యులు, సిబ్బంది ఇందులో పాల్గొన్నారు.

# క్రిషి-డెసిషన్ సపోర్ట్ సిస్టమ్- డిజిటల్ జియో-స్పేషియల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించిన కేంద్ర సహాయ మంత్రి శ్రీ భగీరథ్ చౌధరి



న్యూఢిల్లీ, ఆగష్టు 17: :2023 ఆగస్టు 23న చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమై, విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్‌తో చంద్రునిపై ప్రజ్ఞాన్ రోవర్ అడుగు పెట్టిన విజయానికి జ్ఞాపకార్థంగా, భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 23వ తేదీని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించింది. ఈ విజయంతో, చంద్రుని ఉపరితలంపై అడుగుపెట్టిన నాలుగో దేశంగా, చంద్రుని దక్షిణ ధ్రువాన్ని చేరిన మొదటి దేశంగా భారతదేశం అంతరిక్ష విజాయలు సాధించిన దేశాల సరసన చేరింది.

భారత అంతరిక్ష కార్యక్రమాల చరిత్రలో ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని, "టచింగ్ ద లైవ్స్ వైల్ టచింగ్ ద మూన్: భారత అంతరిక్ష విజయ గాథ'' అనే సందేశంతో దేశంలోని యువతను అంతరిక్షశాస్త్రం, దాని అనువర్తనాలలో నిమగ్నం చేయడానికీ, వారికి స్ఫూర్తి కలిగించడానికీ అంతరిక్ష శాఖ 2024 ఆగస్టులో దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

ఈ శుభ సందర్భంగా, భారతదేశ వ్యవసాయ రంగం అపూర్వమైన వృద్ధిని సాధించడం, దానిని అభివృద్ధి పథంలో నడిపించడంలో అంతరిక్ష పరిజ్ఞానం పోషించే కీలక పాత్ర గురించి వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఒక సదస్సును నిర్వహించింది. దేశంలోని వ్యవసాయ ఆవిష్కరణల రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచే క్రిషి-డెసిషన్ సపోర్ట్ సిస్టమ్ అనే డిజిటల్ జియో-స్పేషియల్ ప్లాట్‌ఫామ్ ప్రారంభానికి ఈ సదస్సు వేదికైంది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ భగీరథ్ చౌధరి, ఆ శాఖ కార్యదర్శి డా. దేవేష్ చతుర్వేదిల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

క్రిషి-డిఎస్ఎస్ అనేది భారతీయ వ్యవసాయ రంగం కోసం ప్రత్యేకంగా ఆవిష్కరించిన తొలి జియో స్పేషియల్ ప్లాట్‌ఫామ్. ఉపగ్రహ చిత్రాలు, వాతావరణ సమాచారం, జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భజల స్థాయిలు, నేల ఆరోగ్య సమాచారం సహా సమగ్ర సమాచారాన్ని ఈ ప్లాట్‌ఫామ్ అందుబాటులో ఉంచుతుంది. ఏ సమయంలో అయినా, ఎక్కడ నుండి అయినా ఈ సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

క్రిషి-డిఎస్ఎస్ సమగ్ర వ్యవసాయ నిర్వహణకు తోడ్పాటునందించేందుకు రూపొందిన అనేక సమాచార విభాగాలు ఇందులో ఉన్నాయి. విస్తారమైన పొలాల నుండి అతి చిన్న మట్టి కణం వరకు ప్రతి అంశాన్ని కృషి-డిఎస్ఎస్ లో ఉంటాయి.

పంటల మ్యాపింగ్, పర్యవేక్షణలతో వివిధ సంవత్సరాలుగా ఉన్న పంటల మ్యాప్‌లను విశ్లేషించడం ద్వారా పంటల తీరు, పంట మార్పిడి పోకడను తెలుసుకోవచ్చు. అలాగే విభిన్న పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుంది.

కరువు పర్యవేక్షణ సమాచారం ద్వారా కరువు సంభవించడానికి ముందే అప్రమత్తమవడంలో మనకు సహాయపడుతుంది, ఇది నేలలో తేమ, నీటి నిల్వలు, పంట పరిస్థితి, వర్షాల్లేని కాలం వంటి వివిధ సూచికలపై తాజా సమాచారం అందిస్తుంది. అయితే పంట వాతావరణ పరిశీలన సమాచారం ద్వారా పంటలపై వాతావరణ ప్రభావం ఎలా ఉంటుంది, పంట కోతల స్థితి, పంట అవశేషాలను కాల్చడం మొదలైన వాటి గురించి మనకు తెలియజేస్తుంది.

ఫీల్డ్ పార్సిల్ సమాచారంతో ఖచ్చితమైన ఫీల్డ్ పార్సిల్ యూనిట్లను మనం విభజించగలగడం వల్ల, ప్రతి పార్సిల్ కీ ఉండే ప్రత్యేక అవసరాలు, చేయదలచుకున్న మార్పుల దృష్ట్యా పంట నమూనాలను అర్థం చేసుకోవచ్చు."ఒక దేశం-ఒక నేల" సమాచార వ్యవస్థ నేల గురించిన సమగ్ర సమాచారాన్ని, అనగా నేల రకం, నేల పిహెచ్, నేల ఆరోగ్యం మొదలైన వాటిని మీకు సులభంగా అందుబా టులో ఉంచుతుంది. నేల నీటి సంరక్షణ చర్యలను అమలు చేయడానికి పంట అనుకూలత, భూమి సామర్థ్యాన్ని అంచనా వేయడంలో నేల గురించిన సమాచారం సహాయకారిగా ఉంటుంది.

పరిశోధకులు, పరిశ్రమలకు వివిధ పంటల సమాచారం అవసరం. నిజ సమాచారంతోపాటు స్పెక్ట్రల్ లైబ్రరీలు, నిజ సమాచార గ్రంథాలయాల ద్వారా క్రిషి-డిఎస్ఎస్ ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది.

వరద నీటి ప్రభావాల అంచనా నుండి పంటల బీమా పరిష్కారాల వరకు క్రిషి-డిఎస్ఎస్ ఒక సంపూర్ణ పరిష్కారం. మన రైతులకు సాధికారత కల్పించడం, మన విధానాలను తెలియజేయడం, మన దేశాన్ని పరిపుష్టం చేయడం దీని లక్ష్యం.

క్రిషి డెసిషన్ సపోర్ట్ సిస్టమ్ (డిఎస్ఎస్)లో అందుబాటులో ఉన్న వివిధ డేటా వనరులను ఏకీకృతం చేయడం ద్వారా, రైతులకు సరైన వ్యక్తిగత సలహాలు, తెగులు దాడి, భారీ వర్షం, వడగళ్ల తుఫాను వంటి విపత్తుల గురించి ముందస్తు హెచ్చరికలతోపాటు వివిధ రైతు-కేంద్రీకృత పరిష్కారాలను రూపొందించవచ్చును.

క్రిషి-డిఎస్ఎస్ కేవలం ఒక సాధనం కంటే ఎక్కువ, ఇది వ్యవసాయంలో ఆవిష్కరణలు, సుస్థిరతను వేగవంతం చేస్తుంది. మొత్తంగా, మనం భారతదేశం కోసం ఒక సమర్థవంతమైన, సుస్థిరమైన, సుసంపన్నమైన వ్యవసాయ రంగాన్ని నిర్మించుకుందాం.

వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ, అంతరిక్ష శాఖ, ఇస్రో కేంద్రాలు, వివిధ కేంద్ర ఏజెన్సీలు (ఐఎండి, సిడబ్ల్యుసి, ఎన్‌డబ్ల్యుఐసి, ఎన్ఐసి, ఐసిఎఆర్, ఎస్ఎల్‌యుఎస్ఐ, ఎమ్ఎన్‌సిఎఫ్‌సి), రాష్ట్ర రిమోట్ సెన్సింగ్ కేంద్రాలు, రాష్ట్ర వ్యవసాయ శాఖ, విద్యాసంస్థలు, విశ్వవిద్యాల యాలు, అగ్రిటెక్ పరిశ్రమలకు చెందిన అధికారులు, ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో అంతరిక్ష సాంకేతికత వినియోగ ప్రస్తుత స్థితిని ప్రదర్శించే వివిధ సాంకేతిక కార్యక్రమాలు, ఉపగ్రహ ఆధారిత సమాచార ఉత్పత్తులను తెలుసుకునేందుకు వీలుగా ఇస్రోకి చెందిన వివిధ వెబ్ సైట్లను ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. వ్యవసాయ రంగంలో అంతరిక్ష సాంకేతికత వల్ల కలిగే ఉపయోగాల గురించి చర్చించడానికి బృంద చర్చలు కూడా నిర్వహించారు.

విధాన రూపకర్తలు, శాస్త్రవేత్తలు, పరిశ్రమ నాయకులు, పరిశోధకులతో కూడిన విశిష్ట సమావేశం భారతీయ వ్యవసాయం ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారం, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార భద్రతను నిర్ధారించడం కోసం అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం వల్ల లభించే అపార సామర్థ్యాన్ని ప్రధానంగా చర్చించింది.

**సదస్సు ముఖ్యాంశాలు:**

-వ్యవసాయ అభివృద్ధి కోసం అంతరిక్ష సాంకేతికతను ఉపయోగించడం: ఖచ్చితమైన వ్యవసాయం, పంట పర్యవేక్షణ, విపత్తు నిర్వహణ, నేల ఆరోగ్య నిర్వహణలో శాటిలైట్ రిమోట్ సెన్సింగ్, జియో-స్పేషియల్ టెక్నాలజీ, వాటి అనువర్తనాలు సాధించిన పురోగతిని ఈ సమావేశంలో ప్రదర్శించారు.

- క్రిషి-డిఎస్ఎస్ ప్రారంభం: వాతావరణ నమూనాలు, నేల పరిస్థితులు, పంట ఆరోగ్యం, పంట విస్తీర్ణం, నలహాలపై తాజా సమాచారం ద్వారా రైతులను శక్తిమంతం చేయడానికి సాధనంగా జియో-స్పేషియల్ ప్లాట్‌ఫామ్-క్రిషి-డిఎస్ఎస్ ఆవిష్కరణ.

-పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యాలు: వ్యవసాయంలో అంతరిక్ష సాంకేతికత వినియోగాన్ని వేగవంతం చేయడంలో ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, విద్యాసంస్థల మధ్య సహకారం ప్రాముఖ్యతను సదస్సు నొక్కి చెప్పింది.

-రైతు-కేంద్రీకృత విధానం: అంతరిక్ష సాంకేతిక ప్రయోజనాలు కింది స్థాయి వరకూ చేరుకునేలా వినియోగదారుల హితమైన పరిష్కారాలు, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలను రూపొందించడం అవశ్యకమని ఈ సమావేశం అభిప్రాయపడింది.

వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ వివిధ అనువర్తనాలు, అంటే పంట ఉత్పత్తి అంచనా, కరువు పర్యవేక్షణ, పంట ఆరోగ్య అంచనా, పంట బీమా పరిష్కారాల కోసం అంతరిక్ష సాంకేతికత సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికీ, భవిష్యత్తులో కూడా అంతరిక్ష సాంకేతికతను ఉపయోగించుకునేందుకూ ఈ శాఖ కట్టుబడి ఉంది. భారతీయ వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం, ఈ లక్ష్యాన్ని సాధించడం కోసం లబ్దిదారులందరితో కలిసి పనిచేయడానికి నిబద్ధతతో కృషి చేస్తున్నది.

# సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

ఖమ్మం, ఆగష్టు 17 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆళ్లపల్లి మండలం రైతు వేదిక కార్యక్రమంలో కళ్యాణ లక్ష్మి చెక్కులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా 17మంది కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని స్థానిక తహసీల్దార్ శకుంతల తెలిపారు. 17మంది లబ్ధిదారులకు 1,10,116ల చొప్పున మొత్తంగా 17లక్షల, 18,972 విలువ గల చెక్కులను అందజేశారు.

అనంతరం 2 సీసీ రోడ్లకు గాను 5 లక్షల 60 వేల చొప్పున, 11 లక్షల 20 వేల రూపాయలతో నిర్మించిన సీసీరోడ్లను శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. అనంతరం మండల, గ్రామ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల అధికారులు సరైన నివేదికలతో రాని వారిపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆగ్రహించారు.అనంతరం ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. మండల స్థాయి అధికారులు ఎలాంటి అలసత్వం వహించకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ప్రజల మధ్యన ఉంటూ సమస్యలు పరిష్కరించే, దిశగా కృషి చేయాలని వారికి దిశానిర్దేశం చేశారు. మండల వ్యాప్తంగా ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి వచ్చిన మండల స్థాయి అధికారులను ఉపేక్షించేది లేదని వారు హెచ్చరించారు.

# రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాల్సిందే..

-ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన హరీశ్?రావు
-ఎంత మందికి పథకం అమలు చేశారో చెప్పండి
-లబ్ధిదారుల సంఖ్య ఎందుకు తగ్గించారు
-సంపూర్ణంగా రుణమాఫీ చేయాలంటే దాడులా?
-తెలంగాణ భవన్‌లో మీడియాతో మాజీ మంత్రి హరీశ్



హైదరాబాద్, ఆగష్టు 17 :రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి ఆ పథకం కింద అర్హులైన రైతులు ఎందరు? ఎంతమందికి అందించారో వెల్లడించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో 36 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశామన్న ఆయన కాంగ్రెస్? 26 లక్షల మందికైనా మాఫీ చేయలేదని విమర్శించారు. శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రుణమాఫీ విషయంలో సంపూర్ణంగా చేశామని వారు చెప్పగలరా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.

సంపూర్ణంగా రుణమాఫీ చేయాలి..

రుణమాఫీ సంపూర్ణంగా చేయమని అడిగితే తనను వ్యక్తిగతంగా దూషిస్తున్నారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్? హయాంలో జూన్, జులైలోనే రైతుబంధు డబ్బులు అందించామని తెలిపారు. ప్రభుత్వం రుణమాఫీపై శ్వేత పత్రం విడుదల చేయాలని హరీశ్ డిమాండ్ చేశారు. రేవంత్?రెడ్డి ప్రభుత్వ పాలనలో వైఫల్యం చెందారని విమర్శించారు. రుణమాఫీ చేయకుండా చేతులెత్తేసిన రేవంత్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి వ్యవహారం రుణమాఫీలో కోత మాటల్లో రోతలా ఉందని విమర్శించారు.

లబ్ధిదారుల సంఖ్య ఎందుకు తగ్గింది..

రూ.31వేల కోట్ల రుణమాఫీ ఉందని చెప్పి రూ.18 వేల కోట్లు మాత్రమే చేశారని హరీశ్?రావు దుయ్యబట్టారు. 54 శాతం మందికి మాఫీ చేయలేదని ఆరోపించారు. ఏరకంగా రుణమాఫీ చేశామని రేవంత్ చెబుతున్నారని ప్రశ్నించారు. 47 లక్షల రైతుల మాఫీకి అర్హులని కేబినెట్?లో చెప్పారన్నారు. 27 లక్షల మంది రైతులకు రూ.17 వేల కోట్లతో రుణమాఫీ చేశారన్నారు. లక్షల రుణమాఫీ చేస్తేనే 36 మందికి వచ్చింది రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తే 22 లక్షల మంది ఉంటారా అని ప్రశ్నించారు. రుణమాఫీ లబ్దిదారుల సంఖ్య ఎలా తగ్గిందన్నారు.

మాట తప్పితే రైతులే నిలదీస్తారు..

రుణమాఫీ పూర్తిగా చేశానని రేవంత్ అనుకుంటే రాష్ట్రంలో ఏ ప్రాంతానికైనా వెళ్లి రుణమాఫీ గురించి రైతులను అడుగుదాం అన్నారు. మాట తప్పిన చరిత్ర సీఎం రేవంత్?ది అని హరీశ్? రావు విమర్శించారు. తన చరిత్ర, రేవంత్ రెడ్డి చరిత్రేంటో ప్రజలకు తెలుసన్నారు.

# కోల్‌కతా ఘటనపై కొనసాగుతున్న డాక్టర్ల నిరసనలు




-నల్లబ్యాడ్జిలతో జూడాల ర్యాలీ
-ఐఎంఏ పిలుపుతో ఓపీ బహిష్కరణ
-నిందితులను కఠినంగా శిక్షించాలి
-ఇందిరా పార్కు వద్ద ధర్నా
-అంతకు ముందు నిమ్స్ నుంచి ర్యాలీ

హైదరాబాద్, ఆగష్టు 17 :కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అమానుష సంఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైద్యులు ఓపీ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు తెలంగాణ అంతటా ఓపీ సేవలను వైద్యులు బహిష్కరించారు. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ సేవలు నిలిచిపోయాయి. ఉస్మానియం, గాంధీ ఆస్పత్రిలో ఓపీలు నిలిచిపోవడంతో పలువురు రోగులు అవస్థలు పడ్డారు. అత్యవసర కేసులు తప్ప అన్ని సేవలు బంద్ చేశారు.ఆందోళనలో భాగంగా హైదరాబాద్‌లో వైద్యులు పలు చోట్ల ర్యాలీలు, ధర్నాలు చేపట్టారు. నిమ్స్ నుంచి ఇందిరా పార్కు వరకు డాక్టర్లు ర్యాలీ నిర్వహించారు. అలాగే ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్దకు వందలాది మంది డాక్టర్లు చేరుకుని ధర్నా చేశారు. డాక్టర్ల ఆందోళనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటా పోలీసులు అప్రమత్తమయ్యారు.

ఆదిలాబాద్ నిర్మల్, మంచిర్యాల, బెల్లంపల్లి ,ఆసిఫాబాద్ మెడికల్ కళాశాలలతో పాటు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవులు నిలిపి వైద్యులు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. ఆదిలాబాద్ రిమ్స్ మెడికల్ కళాశాల విద్యార్థులు వందలాదిమంది ప్లకార్డులు పట్టుకొని హత్యాచార ఘటనపై గొంతెత్తి నినదించారు. పట్టణంలోని నిరసన ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదుట మెడికల్ అందరూ మానవహారం గా ఏర్పడి వాహనాల రాకపోకలను స్తంభింపజేశారు. ఆదిలాబాద్ రిమ్స్ మెడికల్ కళాశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఓపీ సేవలతోపాటు అన్ని రకాల సర్జరీలను నిలిపివేశారు. దీంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రోగులు పలు ఇబ్బందులు పడ్డారు.

ఈ సందర్భంగా మెడికో విద్యార్థినులు జిల్లా కలెక్టర్ రాజార్షి షా కు వినతి పత్రం సమర్పించి కలెక్టర్‌కు రాఖీ కట్టారు. కాగా హత్యాచార ఘటనకు నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు రిమ్స్ కళాశాల ఎదుట నిరసన ధర్నా చేపట్టారు.

# స్వేచ్ఛాయుత ఆలోచనలు, జ్ఞానం సమాజాభివృద్ధికి అవసరం: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఆగష్టు 17: :మన ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడానికి ఉద్దేశించిన కథనానికి రాజ్యాంగవరంగా ఊపిరిపోయాలంటూ సుప్రీంకోర్టును కోరుతూ రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులు ఇటీవల బహిరంగ ప్రకటనలు చేయడంపై ఉపరాష్ట్రపతి శ్రీ జగదీప్ ధన్కడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఐపీ లా అండ్ మేనేజ్‌మెంట్‌లో జాయింట్ మాస్టర్స్/ ఎల్ఎల్.ఎం డిగ్రీ మొదటి బ్యాచ్ విద్యార్థులను ఉద్దేశించి శ్రీ ధన్కడ్ ప్రసంగించారు. "... శాసనసభ కావచ్చు, కార్యనిర్వాహక వర్గం కావచ్చు. న్యాయవ్యవస్థ కావచ్చు... ఆ వ్యవస్థల అధికార పరిధిని భారత రాజ్యాంగం నిర్వచించింది. న్యాయస్థానాల అధికార పరిధిని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా చూడండి.. అమెరికా సుప్రీంకోర్టును చూడండి... యూకే అత్యున్నత న్యాయస్థానం లేదా మరేదైనా చూడండి. ఫిర్యాదు లేకుండా తనకు తానుగా కేసును స్వీకరించిన సందర్భం ఒక్కసారైనా ఉందా.. రాజ్యాంగంలో పొందుపరిచినవి కాకుండా, పరిష్కారాన్ని అందించారా? రాజ్యాంగం అధికార పరిధినీ, అప్పీలేట్ అధికార పరిధినీ అందిస్తోంది. ఇది సమీక్షకు కూడా అవకాశం ఇస్తోంది'' అని ఉపరాష్ట్రపతి ధన్కడ్ అన్నారు.

"మనకు నివారణ మార్గం ఉంది! రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి గత వారం, బహుళ ప్రచారం కలిగిన మీడియాలో చేసిన ప్రకటనపై నేను చాలా ఆందోళన చెందాను. మన ఆర్థిక వ్యవస్థను నాశనం చేసే కథనానికి అధికార పరిధి కల్పించాలని, సుప్రీంకోర్టు సూమోటోగా ముందుకు రావాలని అభ్యర్థిస్తూ దీనిని ఒక ప్రచారస్థాయికి చేర్చారు" అని ఉపరాష్ట్రపతి చెప్పారు.

దేశ సంక్షేమం కాకుండా, పక్షపాత లేదా స్వప్రయోజనాలకు ప్రాధాన్యతనిచ్చే శక్తులను యువత నిర్వీర్యం చేయాలనీ, ఇటువంటి దుశ్చర్యలు దేశ ప్రగతికి విఘాతమని ఉపరాష్ట్రపతి సూచించారు.

తామర తంపరగా పెరుగుతున్న కోచింగ్ సెంటర్లు, వార్తాపత్రికలలో వాటి ప్రకటనలను శ్రీ ధన్కడ్ ప్రస్తావించారు. పదే పదే వారు విజేతల ఫోటోలను మాత్రమే ప్రచురిస్తారని, తద్వారా ఎక్కువ మందిని ఆకర్షిస్తారని వెల్లడించారు.

"కోచింగ్ సెంటర్ల మితిమీరిన ఖర్చు... ఒకటో పేజీ, రెండో పేజీ, మూడో పేజీ... మొత్తం వార్తాపత్రిక నిండా ప్రకటనలు... అన్నింటా అవే అబ్బాయిలు, అవే అమ్మాయిల ఫోటోలు. అవే ముఖాలను వివిధ సంస్థలు ఉపయోగిస్తూ ఉండడం. ఆయా ప్రకటనలు, వాళ్లు చేస్తున్న హడావుడికి పెడుతున్న డబ్బు- మంచి భవితను ఆశిస్తున్న విద్యార్థుల నుంచి వచ్చిందే" అని శ్రీ ధన్కడ్ ఆవేదన వ్యక్తం చేశారు.

మూసగా సివిల్ సర్వీస్ ఉద్యోగాల కోసం వెంపర్లాడే ఆలోచనలను విరమించుకోవాలని, సంప్రదాయ మార్గాలకు అతీతంగా లాభదాయకమైన, ప్రభావవంతమైన కెరీర్ వైపు చూడాలని ఉపరాష్ట్రపతి సూచించారు.

"..ఎందుకు ఒకటే మూసలో ఆలోచించాలి? అవకాశాలు పరిమితంగానే ఉన్నయని తెలుసు. కానీ, బయటకు రండి. లాభదాయకంగా, మీకు వేలు చేకూర్చే ఎన్నో అవకాశాలను శోధించండి. అంతరిక్షం, సముద్ర సంపద... వంటి వాటలో అవకాశాలు ఉండే సాంకేతికత పట్ల మొగ్గు చూపవచ్చు" అని ధన్కడ్ అన్నారు.

భారతదేశం మేధో సంపత్తికి బంగారు గని అనీ, వేదాలు, పురాతన గ్రంథాలు భారతీయ తత్వశాస్త్రం, ఆధ్యాత్మికత, విజ్ఞానానికి పునాది వంటివని అన్నారు. భారతదేశ మేధో సంపదకు ఇవన్నీ ప్రధాన ఉదాహరణలుగా ఉపరాష్ట్రపతి అభివర్ణించారు. జీవితాలను సుసంపన్నం చేసుకోడానికి, ప్రతి అంశంలోనూ పరిష్కారాలను పొందడానికీ వీలుగా ప్రతి ఒక్కరూ వేదాలను స్వయంగా తెలుసుకోవాలని ఆయన కోరారు.

రుగ్వేదపు ఆనంత జ్ఞానాన్ని ఉటంకిస్తూ " శ్రేష్ఠమైన ఆలోచనలను అన్ని మార్గాల నుండి రానిద్దాం" అని అన్నారు శ్రీ ధన్కడ్. ఋగ్వేదంలోని ఈ శ్లోక తాత్పర్యం, సామాజిక అభివృద్ధి కోసం మేధో సంపత్తి సారాన్ని, ఆలోచనలు, జ్ఞాన, స్వేచ్ఛా ప్రవాహాన్ని ప్రస్తుతిస్తుందని ఆయన తెలిపారు. ఆధునిక గణాంకాలను ఉదహరించే బదులు, నేటి మేధో, ఆర్థిక స్థితిగతుల నేపథ్యంలో మన ప్రాచీన జ్ఞాన ఔచిత్యాన్ని బలోపేతం చేస్తూ, మన ప్రామాణికమైన మూలాల నుండి మనం ప్రేరణ పొందాలని ఉపరాష్ట్రపతి సూచించారు.

ఆవిష్కరణ, ఆర్థిక వృద్ధిని నడిపించడంలో మేధో సంపత్తి (ఐపి) చట్టం, నిర్వహణ పోషించే కీలక పాత్ర గురించి చెబుతూ, ముఖ్యంగా ఆధునిక సృజనాత్మక ప్రయత్నాలను, మన ప్రాచీన జ్ఞానం రెండింటినీ రక్షించాలిన అవసరం ఉందన్నారు. ప్రపంచీకరణ యుగంలో 'ఐపి' అంతర్జాతీయ వాణిజ్యానికి మూలస్తంభంగా మారిందని శ్రీ ధన్కడ్ సూచించారు. అత్యధిక జనాభా కలిగి ఉన్న భారత్ వంటి దేశానికి, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికీ, సాంకేతికత బదిలీకి అవకాశం ఇచ్చేలా బలమైన 'ఐపి' రక్షణ అవసరమని ఆయన తెలిపారు.

'ఐపి'ని బలోపేతం చేసే దిశగా, దేశం సాధించిన ప్రగతిని శ్రీ ధన్కడ్ ప్రస్తావించారు. భారతదేశ శాసన విధానం అంతర్జాతీయ ప్రమాణాలతో సరితూగుతోందని, పటిష్టమైన రక్షణను అందిస్తుందని అన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ 'ట్రిప్స్' ఇతర ద్వైపాక్షిక, ప్రాంతీయ ఒప్పందాలకు అనుగుణంగా భారతదేశం 'ఐపి' వ్యవస్థను జాగ్రత్తగా రూపొందించుకున్నదని తెలిపారు. ఇది, ఆవిష్కరణ, ప్రపంచ వాణిజ్యం పట్ల దేశానికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన డిపిఐఐటీ అదనపు కార్యదర్శి శ్రీమతి హిమానీ పాండే, ఢిల్లీ నేషనల్ లా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఎస్ బాజ్‌పాయి, ఇండియన్ లా ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ వీకే అహుజా, విద్యార్థులు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నకిలి విలేఖరికి 14 రోజుల రిమాండ్..

ఆదిలాబాద్, ఆగష్టు 17 : ఓ స్కూల్ ప్రిన్సిపాల్ ను డబ్బులు డిమాండ్ చేసిన నకిలీ స్టాఫ్ రిపోర్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రజాతంత్ర దినపత్రిక జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ని అంటూ? మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని జయరాణి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ హెడ్మాస్టర్ శ్రీరాముల మధుసూదన్ కు ఈనెల 11న ఫోన్ చేసిన రత్నం తిరుపతి రూ.5వేల డబ్బులు డిమాండ్ చేశాడు.

కాగా, మధుసూదన్ ఫిర్యాదు మేరకు జన్నారం ఎస్సై గుండేటి రాజవర్ధన్? నకిలి విలేకరి రత్నం తిరుపతిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అతడిని లక్షెటిపేట కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించి అక్కడి సబ్ జైలుకు తరలించారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

-నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు..
-అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



వరంగల్, ఆగష్టు 17 :వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. శనివారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. డాక్టర్లు, సిబ్బంది హాజరు రిజిస్టర్ లను పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిలను అడిగి తెలుసుకున్నారు.

చిట్యాల టేకుమట్ల, మొగుళ్ళపల్లి, రేగొండ, మండలాల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సిబ్బందితో ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాకాలం సీజన్ లో ప్రజలు విష జ్వరం బారిన పడుతున్న వారికి రక్త నమూనా పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేమ ఎంపీ ఓ రామకృష్ణ, ఆర్ఐ రాజు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, వైద్యులు శ్రీకాంత్, అఖిల, ప్రశాంతి, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# జూనియర్ డాక్టర్లతో చర్చలు సఫలం..



అమరావతి, ఆగష్టు 17 : ఆప్ జూడా ప్రతినిధులు రక్షణ, ఇతర సదుపాయాల గురించి వెలిబుచ్చిన సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ కె.ఎం.సి డాక్టర్ కె.చిట్టి నరసమ్మ, ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డిలు అన్నారు.

శనివారం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్ లో ఆప్ జూడాల ప్రతినిధులు ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, వైస్ ప్రిన్సిపాల్స్, ఆర్.ఎం.ఓ. ల ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో కార్యాలయంలో సిసి కెమెరాలు, విద్యుద్దీకరణ, విశ్రాంతి గదులు, వివిధ సమస్యలపై ఆప్ జూడా ప్రతినిధులు నివేదించారు. కాగా, ఈ సమస్యలపై స్పందించిన ప్రిన్సిపల్, సూపరింటెండెంట్లు మాట్లాడుతూ? ఎలక్ట్రిషన్ సంబంధించి వారం రోజుల్లో అదనపు లైట్లు, 15 రోజుల్లో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు, అదేవిధంగా రెస్ట్ రూములకు సంబంధించి ప్రస్తుతం ఉన్న అవకాశాలతో సర్దుబాటు చేసి శాశ్వత ప్రాతిపదికన సమస్య పరిష్కారానికి నివేదికలు పంపి అనుమతులు లభించిన వెంటనే వాటిని కూడా పూర్తి చేస్తామని తెలిపారు. విద్యార్థులు ఏవైనా సమస్యలుంటే ముందుగా ప్రిన్సిపాల్ ఉ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ హరి చరణ్, డాక్టర్ రేణుక, డాక్టర్ సాయి సుధీర్, డిప్యూటీ సీఎస్ఆర్వో, డాక్టర్ హేమనాలిని ఆర్.ఎం.ఓ డా.వెంకటరమణ హాస్టల్ ఇంచార్జి డాక్టర్ వి.శ్రీలత, సిఎస్ కె ప్రకాష్, జూడాల ప్రతినిధులు డాక్టర్ సాయి సుధీర్, సునీల్, మనోజ్, వర్షిణి, భావన, అఖిల, మాధవరెడ్డి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో వసతి గదుల ఆధునీకరణకు చర్యలు చేపట్టాలి : టీటీడీ ఈవో

తిరుపతి, ఆగష్టు 17 :తిరుమలలోని సప్తగిరి సత్రాలు, సీఆర్వో కార్యాలయాన్ని టీటీడీ ఈవో జె. శ్యామలరావు అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ శనివారం తనిఖీలు చేశారు. సప్తగిరి సత్రాలు వద్ద గదులను పరిశీలించి కారిడార్లు, బాత్‌రూమ్‌లలో పరిశుభ్రత, స్విచ్‌బోర్డులు, జలప్రసాదం, పరుపులు, మంచాలు, బెడ్‌షీట్లను పరిశీలించారు.గదులను ఆధునీకరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, డీప్‌క్లీనింగ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. యాత్రికులతో మాట్లాడి కౌంటర్ల వద్ద గదుల కేటాయింపు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం సెంట్రల్ రిసెప్షన్ కార్యాలయంలో భక్తులకు గదుల కేటాయింపు ప్రక్రియను వారు పరిశీలించారు. ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డు, ఇన్ఫర్మేషన్ కియోస్క్‌లను తనిఖీ చేయడంతోపాటు కర్ణాటక, కళ్లకురిచి నుంచి వచ్చిన భక్తులతో ఈవో మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం తిరుమలలో ఎన్ని గదులు అందుబాటులో ఉన్నాయనే సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రదర్శించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారి వెంట ఎస్ఈ 2 సత్యనారాయణ, ఈఈలు వేణుగోపాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన గిరిజనులకు హక్కులు కల్పించేందుకు విధి విధానాలు రూపకల్పన చేయడం జరుగుతుంది: మంత్రి కొండా సురేఖ






ఖమ్మం, ఆగష్టు 17 : (నేటినిజం ప్రతినిధి): పోడు భూములలో వ్యవసాయ సాగు చేసుకుంటు న్న అర్హులైన గిరిజనులకు హక్కులు కల్పించేందుకు విధి విధానాలు రూపకల్పన చేయడం జరుగుతుంద ని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క),అటవీశాఖ ముఖ్య కార్యదర్శి, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, శాసనసభ్యులు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ మంత్రి మాట్లాడుతూ...పోడు భూముల సమస్య పరిష్కరించి అర్హులైన గిరిజనులకు హక్కులు కల్పించేందుకు విధి విధానాలు రూపకల్పన చేయాలని అన్నారు. పెండింగ్ దరఖాస్తులలో అర్హులైన వారిని గుర్తించాలని, భూముల విషయంలో ఏవైనా వివాదాలు ఉన్నట్లయి తే క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలించాలని అన్నారు. ఖమ్మం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో పోడు భూముల సమస్య శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటా మని తెలిపారు. పోడు భూముల పట్టా కొరకు గతంలో సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి అర్హులు ఉన్నట్లయితే క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారుల సమన్వయంతో సమగ్ర విచారణ జరిపి కమిటీల ద్వారా సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన గిరిజనులకు న్యాయం జరిగేలా అటవీ, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అటవీ శాఖ అనుమతు లు రహదారుల నిర్మాణాలకు చర్యలు చేపట్టడంతో పాటు అడవుల రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి, అటవీ అభివృద్ధి అధికారిణి మంజుల, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు, అధికారులు, తదితరులున్నారు.

## ఏపీలో 19 నుంచి 31వ తేదీవరకు ఉద్యోగుల బదిలీలు.. మార్గదర్శకాలు జారీ

అమరావతి, ఆగష్టు 17 :ఏపీ లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు బదిలీలు చేపట్టగా , తాజాగా ఉద్యోగుల బదిలీల పై దృష్టిని సారించింది. మొత్తం 12 శాఖల్లో ఈనెల 19 నుంచి నెలాఖరు వరకు బదిలీలు చేపట్టనున్న ట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు మార్గదర్శకాలను జారీ చేసింది. ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తివేసింది.

ప్రజా సంబంధిత సేవల్లో ఉండే శాఖల్లో మాత్రమే బదిలీలకు అనుమతించినట్లు ప్రభుత్వం పేర్కొం ది. రెవెన్యూ , పంచాయతీరాజ్ , గనులు, పౌర సరఫరాలు, అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఇంజినీరింగ్, దేవాదాయ , స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, అటవీ, రవాణా, పురపాలక, గ్రామ వార్డు సచివాలయాలు, పరిశ్రమలు, విద్యుత్, వాణిజ్య పన్నులు శాఖలోని ఉద్యోగుల బదిలీలకు అనుమతి ఇచ్చింది. ఎక్సైజ్ శాఖలో బదిలీలకు సెప్టెంబర్ 5 నుంచి 15 వరకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# రైతులంతా ఏకమవ్వాలి.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడాలి.. జగదీశ్‌రెడ్డి పిలుపు



హైదరాబాద్, ఆగష్టు 17 : హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి హేయమైన చర్య అని బీఆర్ఎస్ నాయకుడు జగదీశ్ రెడ్డి అన్నారు. ఇది కాంగ్రెస్ గుండాలు చేసిన పని అని విమర్శించారు. ఇటువంటి చిల్లర వేషాలకు భయపడమని స్పష్టం చేశారు. ఎంతోమంది రాక్షసులను తరిమికొట్టామని తెలిపారు. కేసీఆర్ ముందు ఇలాంటివి నడవవని.. ఆయన శిఖరం వంటి వారని అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు.

రుణమాఫీ విషయంలో అన్నదాతలను కాంగ్రెస్ పార్టీ నిట్టనిలువునా మోసం చేసిందని జగదీశ్ రెడ్డి విమర్శించారు. ఈ విషయాన్ని పక్కదారి పట్టించేందుకే ఇలాంటి దాడులను మొదలుపెట్టారని అన్నారు. ఇవాళ రుణమాఫీ విషయంలో రైతులను నమ్మించి గొంతుకోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు లక్షల రుణమాఫీకి మొదట 40వేల కోట్లు అవుతాయని మేనిఫెస్టోలో చెప్పారని.. ఆ తర్వాత 31వేల కోట్లు అని కేబినెట్‌లో చెప్పారని.. ఆ తర్వాత 27వేల కోట్లు అని చెప్పారని.. ఆఖరకు 17వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని తెలిపారు. ఇవాళ రైతులు తిరగబడుతున్నారని.. అందుకే సీఎం రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కావాలనే ప్రజలను పక్కదారి పట్టించేలా రేవంత్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని.. ఒక్కసారి ఆలోచన చేయాలని రైతులకు సూచించారు. కాంగ్రెస్ మిమ్మల్ని దగా చేస్తుందని.. మోసం చేసిందని అన్నారు.

రేవంత్ రెడ్డి బీజేపీతో దొంగ సంబంధాలు పెట్టుకున్నాడని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీనం అవుతుందని రేవంత్ రెడ్డి పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. రేవంత్ రెడ్డినే దొంగలాగా బీజేపీతో మిలాఖత్ అయ్యాడని విమర్శించారు. సమస్యలను పక్కదారి పట్టించడంలో రేవంత్ రెడ్డి సిద్ధహస్తుడు అని అన్నారు. రాష్ట్రంలో హింస ప్రేరేపించాలని రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ చేసిన రుణమాఫీ భయంకరమైన మోసం, పచ్చి అబద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని ఇప్పటికైనా గ్రహించాలని రైతులకు సూచించారు. రైతుల తరపున బీఆర్ఎస్ కొట్లాడుతుందని.. రైతులకు తాము అండగా ఉంటామని తెలిపారు. ఇప్పటికైనా రైతు భరోసా ఇవ్వాలని, అందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లోని రైతులంతా ఏకమవ్వాలని.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడాలని పిలుపునిచ్చారు.

# విజయవంతంగా సివిల్ సర్వెంట్ల కోసం పబ్లిక్ పాలసీ మరియు గవర్నెన్స్‌పై అడ్వాన్స్‌డ్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్



న్యూఢిల్లీ, ఆగష్టు 17: :నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఔఅఉఉ), ఈఎఖఎఅ/ఎూఖీం ప్రాంతానికి చెందిన బహుళ దేశాల పౌర సేవకుల కోసం పబ్లిక్ పాలసీ మరియు గవర్నెన్స్‌పై మొదటి అడ్వాన్స్‌డ్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఈరోజు న్యూ ఢిల్లీలోని ఔఅఉఉలో విజయవంతంగా పూర్తి చేసింది. సీషెల్స్, సోమాలియా, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా, శ్రీలంక, టాంజానియా, మడగాస్కర్, ఫిజీ, కెన్యా, మాల్దీవులు మరియు మొజాంబిక్‌లకు చెందిన 40 మంది ప్రముఖులతో 2024 ఆగష్టు 5 నుండి ఆగష్టు 16వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహించబడింది. పాల్గొనేవారు డైరెక్టర్ జనరల్, సెక్రటరీ, డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేటర్, జనరల్ మేనేజర్, సీనియర్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ మరియు ఇండస్ట్రీ కోఆర్డినేటర్ వంటి కీలక పదవులను కలిగి ఉన్నారు మరియు వారి సంబంధిత దేశాలలోని ముఖ్యమైన మంత్రిత్వ శాఖలు మరియు సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఎన్‌సిజిజి డైరెక్టర్ జనరల్ మరియు డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్ (డిఏఆర్‌పిజి) సెక్రటరీ శ్రీ వి.శ్రీనివాస్ ఈ వేడుకలో ప్రసంగించారు. పరస్పర విజ్ఞానం మరియు అనుభవాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం వల్ల తమ దేశాల్లో పాలనను మెరుగుపరచడంలో మరియు ప్రభుత్వ విధానాలను అమలు చేయడంలో పాల్గొనే అధికారులందరూ గణనీయమైన విజయాన్ని సాధించగలుగుతారని ఆయన నొక్కి చెప్పారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం మరియు దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడంపై ఆయన ఉద్ఘాటించారు. ప్రోగ్రామ్ నుండి పొందిన అభ్యాసాలు మరియు అనుభవాలను హైలైట్ చేస్తూ, అంతిమంగా దేశాలు ఖాఆఉ లక్ష్యాలను సాధించడంలో మరియు వారు ప్రతిపాదించిన దృక్కోణం ప్రకారం వారి దేశాలను అభివృద్ధి చేయడంలో సహాయపడే అంతర్దృష్టి మరియు విస్తృతమైన ప్రెజెంటేషన్‌లను రూపొందించడం కోసం అతను పాల్గొనే అధికారులను అభినందించాడు.వాలెడిక్టరీ సందర్భంగా, డెనిస్ ఎ. క్లారిస్సే, డైరెక్టర్ జనరల్, సెషెల్స్ నుండి స్థానిక ప్రభుత్వ మంత్రిత్వ శాఖ మరియు ప్రతినిధి బృందం నాయకుడు చొరవ కోసం భారత ప్రభుత్వానికి మరియు ఔఅఉఉకి కృతజ్ఞతలు తెలిపారు. క్రాస్ కంట్రీ జ్ఞానాన్ని పంచుకోవడం ద్వారా వారందరూ ఎలా చాలా ఎక్కువ సంపాదించారో కూడా ఆమె హైలైట్ చేసింది. విధాన రూపకల్పన మరియు అమలు అంతా ఈక్విటీ మరియు ఆచరణాత్మక విధానాలకు సంబంధించినదని ఆమె అన్నారు. ఆరోగ్యం, డిజిటలైజేషన్, ఆధార్ వంటి ఇతర రంగాలలో భారతదేశం నుండి మంచి విధానాలు మరియు ఉత్తమ పద్ధతులు వినూత్నమైనవి మరియు వారందరికీ గొప్ప అభ్యాస అనుభవం అని ఆమె హైలైట్ చేసింది. దేశం యొక్క గొప్ప చరిత్ర మరియు సంస్కృతికి వారు ఎలా మైమరచిపోయారో ఆమె వివరించింది.

ప్రోగ్రామ్ యొక్క అసోసియేట్ ప్రొఫెసర్, ఔఅఉఉ మరియు కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ బా బిష్ట్ ప్రోగ్రామ్ యొక్క స్పుటమైన సారాంశాన్ని అందించారు. ఈఎఖఎఅ/ఎూఖీం దేశాల జియో-పొలిటికల్ మరియు ఎకనామిక్ పొటెన్షియల్, విజన్ ఇండియా 2047, సైబర్ సెక్యూరిటీ పాలసీల అమలు, పబ్లిక్ పాలసీ ఇంప్లిమెంటేషన్‌పై దృక్కోణాలు, డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్‌లో ఇన్నోవేషన్, హెల్త్‌కేర్ గవర్నెన్స్, డిజిటల్ పబ్లిక్ ఇండియా ప్రోగ్రామ్ వంటి ముఖ్యమైన అంశాలపై సెషన్‌లు ఎలా జరిగాయి. భాగస్వామ్యం, హర్ ఘర్ జల్ యోజన ద్వారా స్వచ్ఛ్ జల్‌ను ప్రోత్సహించడం వంటివి కవర్ చేయబడ్డాయి. ఐటిడిఎ డెహ్రాడూన్, ఎఫ్ఆర్ఐ డెహ్రాడూన్, జిల్లా మీరట్‌లోని జిల్లా పరిపాలన, భారత పార్లమెంటు, ప్రధాన మంత్రి సంగ్రహాలయ మరియు తాజ్ మహల్‌లకు సమగ్రమైన అభ్యాస అనుభవాన్ని అందించడానికి ప్రణాళికాబద్ధంగా క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించడం కూడా హైలైట్ చేయబడింది.

## కోర్టు నుంచి తిరిగి వస్తున్న అక్కాచెల్లెళ్లు.. వారిపైకి దూసుకెళ్లిన కారు

లక్నో, ఆగష్టు 17 : కోర్టుకు హాజరైన అక్కాచెల్లెళ్లు నడుస్తూ ఇంటికి తిరిగి వెళ్తున్నారు. వెనుక నుంచి వేగంగా వచ్చిన ఒక కారు వారి మీద నుంచి దూసుకెళ్లింది.దీంతో గాలిలోకి ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో ఈ సంఘటన జరిగింది. భర్తతో వివాదంలో ఉన్న సిమ్రాన్ తన చెల్లితో కలిసి ఆవాస్ వికాస్ కాలనీలోని అద్దె ఇంట్లో నివసిస్తున్నది. శుక్రవారం సోదరితో కలిసి కోర్టుకు హాజరైంది. కేసు వాయిదా పడటంతో ఇద్దరు సిస్టర్స్ నడుస్తూ వారి ఇంటికి వెళ్తున్నారు.

కాగా, వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు అక్కాచెల్లెళ్లను ఢీకొట్టింది. దీంతో గాలిలోకి ఎగిరి రోడ్డుపై పడ్డారు. తీవ్రంగా గాయపడిన సిస్టర్స్‌ను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు వెనక్కి తీసుకోవాలని భర్త, ఇంటి నుంచి బయటకు రావద్దని బావ తమని హెచ్చరించినట్లు సిమ్రాన్ ఆరోపించింది. బావ కారుతో తమని ఢీకొట్టి చంపేందుకు ప్రయత్నించి ఉంటాడని అనుమానం వ్యక్తం చేసింది.

మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ద్వారా కారును గుర్తించారు. భర్తతో పాటు ఆమె సోదరులతో కూడా సిమ్రాన్‌కు గొడవలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నేరానికి ఉపయోగించిన కారు సోదరుడు వాహిద్ అత్తమామల కుటుంబ సభ్యుడిగా గుర్తించినట్లు చెప్పారు. దీంతో సిమ్రాన్ సోదరుడు వాహిద్ ప్రమేయం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

# రైతులందరికీ రుణ మాఫీ చేయాలి : మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి




నిజామాబాద్, ఆగష్టు 17 :ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో రైతులందరికీ రుణమాఫీ (ఒనీజీని లిజీతిలవతీ) వర్తింపజేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి (ఎవఎబీశ్రీజీ ఖతీజీబప్రజీనిబిప్ర ఖీవటటఎ) డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ (ఔతిళిజీఎజీఎజీఓ) జిల్లా వేల్పూర్ ఎక్స్ రోడ్ లో ఆధ్వర్యంలో రుణమాఫీ కోసం రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు.

షరతులు లేకుండా ప్రతి ఒక్కరికి రైతు రుణమాఫీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో 30వేల మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటను నెరవేర్చలేని కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు త్వరలో గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ప్రాధాన్యం ఇచ్చామని, సకాలంలో రుణమాఫీ, రైతు భరోసా అందించామని గుర్తుచేశారు. రైతులకు ఉచిత విద్యుత్, పంటలకు నిరంతర కరెంట్, ప్రాజెక్టుల ద్వారా నీటి సరఫరాల, అందుబాటులో విత్తనాలు అందించి ఆదుకున్నామని పేర్కొన్నారు.

# ఆర్జే మెడికల్ కాలేజీలో మహిళా డాక్టర్ హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి

**-కోల్ కతా డాక్టర్ హత్య, అత్యాచార ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన..**




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 17 :(నేటినిజం ప్రతినిధి):కోల్ కతా లో ట్రైనీ డాక్టర్ పై కామందులు అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటనకు నిరసనగా హత్యకు గురైన యువ డాక్టర్ ఆత్మకు శాంతి చేకూరాలని, న్యాయం జరగాలని కోరుతూ..వేములవాడ పట్టణంలోని సుభాష్ నగర్ లో అభివృద్ధి కమిటీ సభ్యులు , యువకులు కొవ్వత్తుల ప్రదర్శన నిర్వహించారు. అత్యాచార, హత్య నిందితులను కఠినంగా శిక్షించాలని,

బాధితురాలికి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వైద్య నిపుణులకు, మహిళలకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సరైన భద్రత ప్రమాణాలు లేకపోవడం వలన ఇలాంటి ఘటన జరిగిందని, డ్యూటీలో ఉన్న వైద్యురాళ్ళకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఇలాంటి ఘటనలు ఇలాగే కొనసాగితే అసురక్షితమైన వాతావరణంలో వైద్యులు పని చేయడం కష్టమవుతుందని, ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే దేశంలో వైద్యుల కొరత తీరుతుందని వారన్నారు. ఇలాంటి ఘటన పునరుద్ధం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవా లని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఇప్పపుల అజయ్, డాక్టరేట్ గ్రహీత రాపల్లి శ్రీధర్, ముస్లిం పట్టణ అధ్యక్షులు అక్రమ్, సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్ మన్నాన్,అబ్దుల్ కలీం, రియాజ్ ఇమ్రాన్, రజక సంఘం యూత్ నాయకులు శివ, శ్రీనివాస్, ముస్లిం సోదరులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## హబ్సిగూడలో బస్సు కిందికి దూసుకెళ్లిన ఆటో.. పదో తరగతి విద్యార్థిని మృతి

హైదరాబాద్, ఆగష్టు 17 : హైదరాబాద్‌లోని హబ్సిగూడలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్కూల్ పిల్లల ఆటో ఆర్టీసీ బస్సు కిందికి దూసుకెళ్లడంతో పదో తరగతి విద్యార్థిని మృతిచెందగా, ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నది. శనివారం ఉదయం హబ్సిగూడ మెట్రో స్టేషన్ వద్ద స్కూల్ ఆటోను ఓ ట్రక్కు ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన ఆటో.. ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కిందికి దూసుకెళ్లింది. ఆటోలో ఉన్న సాత్విక అనే విద్యార్థిని, డ్రైవర్ ఎల్లయ్య తీవ్రంగా గాయపడ్డారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. క్రేన్ సహాయంతో ఆటోను వెలికితీశారు. క్షతగాత్రులను నాచారంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో సాత్విక మరణించింది. ఆటో డ్రైవర్ ఎల్లయ్య పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎంపీడీవో వేణుమాధవ్,కార్యదర్శి వీరన్నలను సన్మానించిన పంచాయితీ కార్యదర్శులు



మహబూబాబాద్, ఆగష్టు 17(నేటినిజం ప్రతినిధి): ఎద్దవంగర మండలంలో ఎంపీడీవో గా బోడేపూడి వేణుమాధవ్,కాన్వాయిగూడెం పంచాయితీ కార్యదర్శిగా ఆవుల వీరన్న ఉత్తమ సేవలందించినందుకు గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ మరియు కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా శనివారం రోజున వారిని పెద్దవంగర మండలంలోని కార్యదర్శులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు రవి, రమేష్, పరమేష్, మణికుమార్, గీత, లలిత, విప్లవ, శ్రీను,ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివారం రాఖీ పంపిణీ మరియు రక్షాబంధన్ కూడా

**-పోస్ట్ మాస్టర్ జనరల్ కృష్ణ కుమార్ యాదవ్**

న్యూఢిల్లీ, ఆగష్టు 17: :సోషల్ మీడియాలో నడుస్తున్న వర్చువల్ రాఖీలను సిల్క్ థ్రెడ్‌లు మరుగుజ్జు చేశాయి. సోదరీమణులు తమ సోదరులకు పోస్టాఫీసుల ద్వారా రంగురంగుల రాఖీలను పంపేందుకు ఇష్టపడుతున్నారు. తపాలా శాఖ కూడా ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. పోస్ట్ మాస్టర్ జనరల్, ఉత్తర గుజరాత్ రీజియన్, అహ్మదాబాద్ శ్రీ కృష్ణ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, అహ్మదాబాద్ ప్రాంతంలోని వివిధ పోస్టాఫీసుల నుండి ఇప్పటివరకు 3 లక్షలకు పైగా రాఖీలు బుక్ చేయబడ్డాయి మరియు దేశ విదేశాలకు పంపబడ్డాయి. రాఖీల పంపిణీకి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆదివారం, రక్షా బంధన్‌కు ఒక రోజు ముందు, కాబట్టి ఏ సోదరుడి మణికట్టును తాకకుండా వదిలివేయవద్దు. దేశం వెలుపల కూడా రాఖీ క్రేజ్ చాలా ఎక్కువ. పోస్ట్‌మాస్టర్ జనరల్ శ్రీ కృష్ణ కుమార్ యాదవ్ మాట్లాడుతూ పోస్టాఫీసుల నుండి స్పీడ్ పోస్ట్ మరియు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా విదేశాలకు రాఖీలను పంపుతున్నట్లు తెలిపారు.

# ఫాస్టోరల్ గొర్రెలు మరియు మేకలకు ఈఓఆకి వ్యతిరేకంగా టీకాలు వేయాలనే నిర్ణయం దేశంలోని అటువంటి జనాభాందరికీ విస్తరించబడింది: శ్రీ రాజీవ్ రంజన్ సింగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 17: :శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్, కేంద్ర ఫిషరీస్, పశుసంవర్ధక ఉ పాడిపరిశ్రమ శాఖ మంత్రి 2030 నాటికి టీకాలు వేయడంతో ఎఫ్ఎమ్‌డి-ముక్త్ భారత్ (ఎఫ్ఎమ్‌డి-ఫుట్ ఉ మౌత్ డిసీజ్) లక్ష్యాన్ని సాధించే దిశగా శాఖ చేపట్టిన చర్యలను సమీక్షించారు. పశుసంవర్ధక రంగం భారతీయ ఆర్థిక వ్యవస్థకే కాకుండా రైతుల జీవనోపాధికి, ముఖ్యంగా గ్రామీణ కుటుంబాలు మరియు పశువుల సంరక్షణ వెనుక ప్రధాన శక్తిగా ఉన్న మహిళలకు దోహదపడే ముఖ్యమైన రంగం. ఆరోగ్య సంరక్షణ అవగాహన, అందుబాటు మరియు ఆసక్తి ఆందోళన కలిగించే అంశంగా మిగిలిపోయిందని, దీని కారణంగా జీవనోపాధిలో భారీ నష్టాలు ఉన్నాయని కేంద్ర మంత్రి గమనించారు. ప్రొఫెసర్. ా.ఖ. సింగ్ బఘేల్, ఫిషరీస్, పశుసంవర్ధక ఉ పాడి పరిశ్రమ శాఖ సహాయ మంత్రి మరియు DAHD కార్యదర్శి శ్రీమతి. ఈ సమావేశంలో అల్కా ఉపాధ్యాయ కూడా పాల్గొన్నారు. 2030 నాటికి భారత్‌ను ఎఫ్ఎండీ రహితంగా మార్చే కార్యాచరణ ప్రణాళికపై సమావేశంలో చర్చించారు. దేశంలోని ముఖ్యంగా కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర ఉ గుజరాత్ రాష్ట్రాల్లో టీకాలు వేయడం ముందస్తు గా ఉన్న చోట సీరో-సర్వేలెన్స్ ఆధారంగా జోన్‌లను రూపొందిం చడానికి అన్ని అంచనాలు రూపొందిం చినట్లు సమాచారం. ఎఫ్ఎమ్‌డి రహిత జోన్‌లుగా ప్రకటించడానికి ప్రాధాన్యతనిస్తుంది. ఇది ఎగుమతి అవకాశాలను కల్పించడంలో సహాయపడుతుం ది.జంతు వ్యాధులు ప్రబలడం పశుసంవర్ధక రంగం వృద్ధికి తీవ్ర ఆటంకంగా ఉందని కేంద్రమంత్రులు తెలియజేశారు. కేవలం ఎఫ్ఎండీ కారణంగానే దాదాపు రూ. రూ. సంవత్సరానికి 24,000 కోట్లు. ఈ వ్యాధిని నియంత్రించడం మరియు నిర్మూలించడం వల్ల పాల ఉత్పత్తి పెరుగుతుంది,




లక్షలాది మంది రైతులకు జీవనోపాధి లభిస్తుంది, వారి ఆదాయాన్ని పెంచుతుంది మరియు అంతర్జాతీయ వాణిజ్య అవసరాలకు అనుగుణంగా పాలు మరియు పశువుల ఉత్పత్తుల ఎగుమతులు పెరుగుతాయి.

